పెద్దకథ

# ఏం చెయ్యాలి

ఓల్గా



సీరియస్‌గా రాసుకుంటూ శాంత ఎవరో వచ్చినట్లనిపించి తలెత్తింది.

మోహన్- తన దగ్గర పనిచేస్తున్న రిసెర్చి ఆఫీసర్. శాంతకు చాలా విసుగొచ్చేసింది.

శాంత హైదరాబాదు వచ్చి ఈ రిసెర్చి ఇన్‌స్టిట్యూట్‌లో చేరి నాలుగు నెలలే అయింది.

ఈ నాలుగు నెలల్లోనూ ఎవరితోనూ స్నేహం కుదరలేదు గానీ మోహన్ లాంటి కొందరితో పరిచయం కూడా పెరగదని ఖచ్చితంగా తెలిసింది.

మోహన్‌కి సబ్జక్టు అంతగా తెలియదు. పనీ చెయ్యడు. ఏదో కబుర్లు చెప్పి కాలక్షేపం చెయ్యాలని చూస్తాడు. నాలుగు నెలల నుంచీ పనికిమాలిన సందేహాలతో చర్చలతో శాంత టైము తినేస్తున్నాడు.

శాంత విసుగుని పట్టించుకోకుండానే మోహన్ వచ్చికూచున్నాడు. తను పని చెయ్యకుండా ఎంత గొప్పపని చేస్తున్నాడో ఓ అరగంట మాట్లాడాడు.

శాంత మాట్లాడకుండా విన్నది.

మోహన్‌కి మాటలయిపోయాయి. శాంత చేత మాట్లాడించాలని కంకణం కట్టుకున్నవాడిలా అక్కణ్ణించి కదల్లేదు.

శాంత చేసేది లేక టీ తెప్పించింది.

“మీ స్వగ్రామం ఏదండీ” ఉబుసుపోక కబుర్లు మొదలెట్టాడు.

అరవైఏళ్ళ వృద్ధుడిలా ప్రశ్న అడుగుతున్న మోహన్‌ని చూస్తే నవ్వొచ్చింది శాంతకు. అతనికి ముప్ఫయ్యయిదేళ్ళు వుంటాయో లేదో-

“గుంటూరు పుర అగ్రహారమండీ” అంది తమాషాగా. “గుంటూరా? మా అత్తవారిది కూడా గుంటూరేనండీ” అన్నాడు మళ్ళీ ముసలివాడి తాతలా.

శాంత అలాగా అన్నట్టు తలవూపింది.

"మా ఆవిడ గుంటూర్లోనే చదివింది. ఏమెస్సి కాలేజీ-బియ్యస్సీలో గోల్డు మెడలిస్టు"—అదంతా తన గొప్పే అన్నట్టు చెప్పాడు.

ఈసారి శాంతలో ఆసక్తి కనిపించింది.

"మీ మిసెస్ పేరేమిటి?"

"శోభ. శోభాదేవి"

"శోభా, మీరు శోభ భర్తా-" శాంత ఆశ్చర్యంగా చూసింది.

"శోభ మీకు తెలుసున్నమాట"

"తెలియడం ఏమిటి? మేం మంచి స్నేహితులం. మీ పెళ్ళికి నేనూ వచ్చాను. మిమ్మల్ని గుర్తుపట్టలేక పోయాను. అప్పుడు పెళ్ళికొడుకు వేషంలో గదా చూసింది. ఎలా వుంది శోభ?"

"బాగుందండి... చాలా బాగుంది. ఇద్దరు మగపిల్లలు. సొంత యిల్లు కట్టించాను. అన్నీ సౌకర్యంగానే వున్నాయి. ఏ లోటూ లేదు!"

"ఎన్నిరోజులయిందో శోభని చూసి. రోజులేమిటి? పది పన్నెండేళ్ళుఅయింది. మీ పెళ్ళయ్యాక మళ్ళీ చూళ్ళేదు!"

"ఐతే యింకేం. రేపుఆదివారమేగా. మా ఇంటికి రండి. ఏకంగా భోజనానికి వచ్చెయ్యండి" మోహన్ ఆహ్వానించాడు.

"అలాగే... తప్పకుండా వస్తాను. శోభను చూడటానికైనా వస్తాను" శాంత సంతోషంగా అంగీకరించింది. శాంత హఠాత్తుగా తన భార్యకు స్నేహితురాలవ డం మోహన్‌కి గొప్పగా వుంది.

ఆ సంతోషంలో శాంతనుతొందరగా ఒదిలి ఇంటికి బయల్దేరాడు.

"శోభ- శోభను చూస్తాను" అనుకుంటే శాంతకు తమాషాగా విచిత్రంగా అనిపించింది.

ఒకప్పుడు ప్రాణ స్నేహితుల్లా వుండేవారు. శోభ పెళ్ళితో యిద్దరూ దూరమ య్యారు. కనీసం స్నేహితుల్లా మిగల్లేక పోయారు. అందుకు తనే కారణమని శాంత ఎప్పుడూ బాధపడుతుంటుంది.

ఆ రోజులన్నీ శాంతకు గుర్తొచ్చాయి.

తనా రోజు అంత పిచ్చిగా ప్రవర్తించకపోతే శోభ స్నేహం పోయేది కాదేమో!

ఇప్పుడు శోభ తనను పలకరిస్తుందా? స్నేహంగా సంతోషంగా మాట్లాడుతుందా?


నవ్వుతుందా తనను చూసి-

ఎంత బాగుంటుంది శోభ నవ్వు!

తన మాటలు మర్చిపోయి నవ్వుతుందా?

తనైనా శోభ సంగతి తెలిసీ ఎందుకలా మాట్లాడింది?

శోభ ఎంత మంచిది. ఎప్పుడూ ఎవరినీ నొప్పించదే! ఆ శోభని కసిరినట్టుగా ఎందుకలా మాట్లాడింది తను?




అసలలా మాట్లాడకుండా ఎందుకు వుండలేకపోయింది? శాంతకు తన కాలేజీ రోజులు గుర్తొచ్చాయి. శోభ తను కబుర్లాడుకుంటూ తిరిగిన కాలేజీ వరండాలూ, గదులూ, దారులూ అన్నీ గుర్తొచ్చాయి. రావి చెట్టు కింద అరుగూ, మాధవీలత పందిరీ, శోభ వాళ్ళింటి పెరట్లోజామచెట్టూ అన్నీ గుర్తొచ్చాయి. అదే సమయంలో-

"రోజూమా ఆఫీసర్ శాంత గురించి చెబుతా నే- ఆవిడెవరో గాదు నీ స్నేహితురాలే- చాలా తెలివిగలదిలే- రేపు మనింటికి భోజనానికి వస్తుంది" అని భర్త చెబుతుంటే శోభ కూడా వీటన్నిటినీ గుర్తుకు తెచ్చుకుంటున్నదని శాంతకు తెలియదు. ఒకరికి తెలియకుండా ఒకరు ఒకేసారి కాలేజీరోజుల జ్ఞాపకాల్లోకి వెళ్ళిపోయారు.

"శోభా- డిబేటింగ్ పోటీలకు నీ పేరు యిచ్చావా లేదా?" తెలుగులెక్చరర్ స్వరాజ్యలక్ష్మిగారు క్లాసు నుంచి వెళ్ళబోతున్నావిడ ఆగి మరీ అడిగారు.

"లేదు మేడమ్" అంది శోభ లేచి నిలబడి.

"ఆదేం- ఎందుకని?"

స్వరాజ్యలక్ష్మిగారు ఆశ్చర్యపోయినా యింక ఆగడానికి వీల్లేకపోయింది.

ఫిజిక్సు లెక్చరర్ విజయలక్ష్మిగారు అప్పటికే గుమ్మంలోకి వచ్చేశారు.

ఆశ్చర్యంతోనే ఆవిడ క్లాసులో నుంచి బైటికి నడిచారు.

ఐతే శోభ పక్కనే కూచున్న శాంత వూరికే ఆశ్చర్యపడి వూరుకోలేకపోయింది.

విజయలక్ష్మి గారు ఆటెండెన్సు తీస్తున్నంతసేపూ సణుగుతూనే వుంది.

"పేరెందుకివ్వలేదు? నేనిచ్చాను. మనిద్దరం టీమ్‌గా వెళ్దామనుకున్నాం గదా. నిన్న ఇస్తాననే అన్నావు గదా?" అంటూ నసపెడుతూనే వుంది.

శోభ చిరునవ్వుతో "క్లాసయ్యాక చెబుతాలే నోరు మూసుకుకూచో" అని కసిరింది.

క్లాసయ్యాక యిద్దరూ గేటు దగ్గర వున్న మాలతీలత పందిరి కింద కూచున్నారు.

"ఇప్పుడు చెప్పు! మనిద్దరం టీమ్‌గా వెళ్దామనుకున్నాంగా. నేను నీ అంత బాగా మాట్లాడలేననేనా?" అంటూ నిష్ఠూరమాడింది శాంత.

"ఛా- ఎందుకలా అంటున్నావు. మా ఇంట్లో ఒద్దన్నారు" అంది శోభ నిర్వి చారంగా.

"ఆదేంటి. ఎందుకొద్దన్నారు?"

"ఏమో-" అని కాసేపాగి కారణం చెప్పింది శోభ.

"పోటీలు జరిగేది హిందూ కాలేజీలో. ఆ కాలేజీ అబ్బాయిలు ఉత్తరాదిలంట. ఆ పోటీలు మొదలయ్యేది ఆరు గంటలకు. పూర్తయ్యేసరికి రాత్రి తొమ్మిదో పదో అవుతుంది. అంత రాత్రిపూట ఆ కాలేజీ నుంచి ఎలా వస్తావు. వద్దన్నారు" కాస్త చిన్నబుచ్చుకునే చెప్పింది.

"అసలివన్నీ వాళ్ళకెందుకు చెప్పావు- ఎక్కడ పోటీలు జరిగేదీ ఎప్పుడు జరిగేదీ అసలు నువ్వు పోటీకి వెళ్తున్నట్టూ యివన్నీ వాళ్ళకు చెప్పకపోతే ఏం?"

"చెప్పకుండా ఎలా? నువ్వు చెప్పలేదా?"

"ఇంకా నయం- ఎందుకూ చెప్పడం-' పదింటిదాకా పోటీ వుంటుంది... నేను ఆ టైముకి వస్తాలే భయపడకు... వెళ్ళు!' అనే వాళ్ళయితే చెప్పినా అందం. చెప్పగానే మానెయ్యమనే వాళ్ళకు చెప్పడం ఎందుకు?"

శాంత చిరాకుపడింది.

"మరానేళ ఇంటికి ఆలస్యంగా వెళ్తే ఏమీ అనరా?" "అంటారు. మనం మాత్రం వూరుకుంటామా? కాలేజీలో ఏదో ఒక పని వుండదా? ఆలస్యంగా వెళ్ళమా? వాళ్ళతో పోట్లాడమా? దీనికి కూడా పర్మిషన్ అడగాలా?" కోపం తెచ్చుకుంది.

"ఏమో ! నేను మా అమ్మకూ నాన్నకూ చెప్పకుండా ఏ పనీ చెయ్యను. వాళ్ళు ఒద్దన్న పని అసలు చెయ్యను!"

స్థిరంగా శాంతంగా హృదయపూర్వకంగా అంటున్న శోభను చూస్తూ వుండిపోయింది శాంత.

శోభ ఎంత మంచిది, ఎంత తెలివైంది, ఎంత వివేకంగా ఆలోచిస్తుంది అనుకుంది.

శాంతే కాదు, శోభను గురించి అలా అనుకోని వాళ్ళుండరు.

శోభను చూడడమే చాలా హాయిగా వుంటుంది.

అందమని కాదు. ఎప్పుడూ చిరునవ్వుతో వుండే శోభ ముఖం చూసిన కొద్దీ చూడాలనిపిస్తుంది. ఆ చిరునవ్వు పెదవుల మీద నుంచి చెదిరిపోయే పరిస్థితి తెచ్చుకోదు శోభ. చాలా తెలివైనది.

ఎప్పుడేపని చెయ్యాలో ఆ పని చేసెయ్యడం వల్ల ఎవరి కోపానికీ గురికాదు.

అన్నిటిలోనూ మితంగా వుంటుంది. ఒక్క మాట ఎక్కువ మాట్లాడదు. చెయ్యకూడని పని చచ్చినా చెయ్యదు. ఒకోసారి శాంతకు కోపం వస్తుంది. క్లాసులు ఎగ్గొట్టి సంవత్సరానికి ఒక్క సినిమా అన్నా చూడకపోతే ఏం బాగుంటుంది? శోభ ఎప్పుడూ అలా సినిమాకి రాదు. కానీ క్లాసు ఎగ్గొట్టి వెళ్తున్న స్నేహితుల్ని ఒద్దనదు. చిన్న చూపు చూడదు. చాలా స్నేహంగా వుంటుంది. కావాల్సిన సహాయం చేస్తుంది. చివరి దాకా సహకరిస్తుంది. తాను మాత్రం రానంటుంది. అలాగని స్వార్థంగా ఒక్కతే వెళ్ళి క్లాసులో కూచుని పాఠం వింటుందా అంటే అదీ లేదు. ఇంటికెళ్ళిపోతుంది.

ఇంట్లో అమ్మతో...

"అందరూ సినిమా కెళ్ళారు. మేడమ్ ఎలాగూ పాఠం చెప్పరని ఒచ్చేశాను" అంటుంది. మర్నాడు ఉదయం సినిమా హాల్లో జరిగిన తతంగమంతా



స్నేహితులు చెబుతుంటే నవ్వుతూ వింటుంది. హృదయ పూర్వకంగా ఆనందిస్తుంది. ముందు వరుసలో అబ్బాయిల్ని ఏడిపించినందుకు రాజశ్రీకి షేక్ హేండ్ యిస్తుంది. ఐతే ఈ తమాషాలో తాను లేనందుకు ఎప్పుడూ విచారించదు.

ఆమెను చూసి ఎలా కోపం తెచ్చుకోవాలో శాంతకు తెలియదు.

ఎందుకంటే ఫిజిక్సు, లెక్కలూ గంటలు గంటలు శోభ శాంతకు చెబుతుంది. డిబేటింగ్ పోటీ ల్లాంటివి వస్తే లైబ్రరీకి వెళ్ళి క్షణాల్లో తనకూ శాంతకూ కావాల్సిన సమాచారం తానే సేకరించి తెస్తుంది.

అంతా శోభ సిద్ధం చేసి తెచ్చి యిచ్చినా శాంత బాగా చెప్పలేక పోయేది.

శోభ ప్రసన్న వదనంతో ఒక పద్ధతిలో తన వాదాన్నంతా అవతలి వాళ్ళు ఔననేలా ఏ జంకూ లేకుండా హడావుడి పడకుండా వినిపించేది. టీమ్‌గా వాళ్ళదే విజయం.

ఎలాగోలా శోభను ఒక్క విషయంలోనైనా తన వెనక వుండేలా చెయ్యాలని శాంత అపుడపుడూ తాపత్రయ పడేది. శోభ రంగంలో వుండగా అదెప్పుడూ కుదిరేది కాదు. ఐతే శోభ అన్నిటిలో అందరికంటే ముందు వున్నందుకు ఎవరూ అసూయపడేవారు కాదు. శోభ ఎవరిలోనూ అసూయను కలిగించేలా వుండేది కాదు. ఆమె కాళ్ళు ముందున్నా ఆమె చేతులు స్నేహితుల భుజాల మీద వుండనే వుండేవి. శోభ మీద ఎవరైనా ఎందుకు కోపం తెచ్చుకోవాలో ఎవరికీ తెలిసేది కాదు. శోభలా తాను ఉండలేదెందుకని శాంత ఆరాటంగా,అశాంతిగా అనుకునేది.

'తనకు తృప్తి అన్నది లేదు. మితం అన్నది లేదు. అన్నీ తనకే కావాలి. దాని మూలాన ఎన్ని చిక్కులు.ఎంతఅశాంతి. పోటీల విషయం ఇంట్లో చెబితే ఒద్దంటారు. తాను చెప్పదు. ఆరోజు రాత్రి ఆలస్యంగా వెళ్ళి తిట్లు తింటుంది. ఏడుస్తుంది. బహుమతిని చూసి 'గొప్పే' అని పెదవి విరిచే అన్నయ్య మీద కోపంతో మండిపడుతుంది. మనసంతా అల్లకల్లోలం చేసేసుకుంటుంది. ఇదంతా బాధే ఐనా సరే పోటీలకు వెళ్ళకుండా వుండలేదు. శోభ హాయిగా వుండగలుగుతుంది. తనెందుకు వుండలేదు?

'ఇదే కాదు... సినిమాలకీ షికార్లకీ మీటింగులకీ ఇంట్లో చెప్పకుండా వెళ్తానే వుంటుంది. రెండు నెలల క్రితం కాలేజీలో సమ్మె జరిగితే తనే ముఖ్యురాలై పోయింది.

శోభ హాయిగా ఇంట్లో కూచుంది.

తను కాలేజీ గేటు ముందు నిలబడి ... బైటయుంచి లెక్చరర్ల దృష్టిలో పడి - ప్రిన్సిపాల్ తన ఇంటికి కబురు చేసి......

ఆ రోజు అమ్మ ఎట్లా తిట్టింది! నాన్న జుట్టు పట్టుకుని ఎట్లా ఊపాడు! అన్నయ్య ఎంత హేళనగా నవ్వాడు. రోజంతా ఏడుపే. అంత ఏడుపులోనూ ఏ.పి. కాలేజీ విద్యార్థులు-ముఖ్యంగా రాంకుమార్ – చెప్పిన మాటలు చాలా న్యాయంగా అనిపించాయి. సమ్మె చెయ్యడం చాలా కరెక్టు అనిపించింది. అది చెప్పబోతే ఇంట్లో మరింత తిట్టారు.

'ఎందుకు తనంత అశాంతి కొని తెచ్చుకుంటుంది? శోభలా హాయిగా అమ్మా నాన్నలు ఒద్దన్న పనిమానేస్తే ఎంత బాగుంటుంది.

ఎప్పుడు చెయ్యాల్సిన పని అప్పుడు చేస్తే ఎంత బాగుంటుంది...'

"బస్ టైమయింది. ఏంటి నీ తపస్సు!"

శోభ శాంతను తట్టి లేపింది.

"ఐతే నేను ఎలక్యూషన్ పోటీకి వెళ్తాను. పేరు ఇచ్చి వస్తాను!"

అంటూ ఇంగ్లీషు డిపార్ట్‌మెంట్ వైపు పరిగెత్తింది.

"రేపివ్వచ్చుగా. బస్ పోతుంది" అంటున్న శోభ మాటలు వినిపించుకోనే లేదు.

శోభ గేటు దాటే సరికి బస్ వస్తూనే వుంది. శాంత కోసం ఎదురు చూడకుండా శోభ బస్ ఎక్కేసింది.

తర్వాత నాలుగు రోజులూ శాంత శోభా కలిసే ఉపన్యాసానికి కావాల్సిన సమాచారం అంతా సేకరించారు. ఎక్కువగా శోభే కష్టపడింది. పోటీలు జరిగిన మరునాడు ఉదయం ఎనిమిదింటికే శాంత పిలుపు విని ఆశ్చర్యంతో బైటి కొచ్చింది శోభ.

ఒక్కసారే ఆమెను చుట్టేసింది శాంత.

ఏంటి ఏంటంటున్న శోభకు"అదుగో చూడు"అంటూ తాను మొయ్యలేక బల్లమీద పెట్టిన యింతెత్తు కప్పును చూపించింది.

"కంగ్రాట్స్ - మొత్తానికి సాధించావు!"నవ్వుతూ శాంతను లోపలికి తీసికెళ్ళింది. "అమ్మా అమ్మా" అంటూ హడావుడిగా తల్లిని పిల్చి శాంత విజయం గురించి చెప్పింది.

"ఇప్పుడే వస్తామండ" నంటూ వంటింట్లోకి వెళ్ళింది.

"శోభ పోటీకి వస్తే ఈ బహుమతి తనకే వచ్చేదండి!"

అంది శాంత మనస్ఫూర్తిగా కృతజ్ఞతాపూర్ణతో.

"ఆ అర్ధరాత్రి దాకా యిల్లు పట్టకుండా తిరిగి కప్పులు సంపాదిస్తే ఏం ఒరుగుతుంది. నా కిష్టం లేదమ్మా" అందావిడ.

శాంత ఉత్సాహం నీరు గారిపోయింది.


## ఉద్యోగ అవకాశములు - ఉచిత శిక్షణ

ఉద్యోగములు: 1. డ్రాయింగ్ టీచర్స్ 2. ట్రేసర్స్ 3. కార్టూనిస్ట్ 4. ఆర్టిస్ట్స్.
శిక్షణాకాలం: 40 రోజులు.
స్వయం ఉపాధికి: రేడియో, టేప్ రికార్డర్, టి.వి. మరియు వి.సి.పి. మెకానిజం శిక్షణ ఇవ్వబడును.
విద్యార్హతలు: 7వ తరగతి పాస్ నుండి డిగ్రీ పాస్/ఫెయిల్
జీతం స్కేలు: ఉత్తీర్ణులైనవారు నెలకు 1250/- నుండి 1800/- వరకు పొందవచ్చును.

పై ఉద్యోగములో నియమించుటకుగాను ఎ.పి. బోర్డు వారు నిర్వహించుచున్న టెక్నికల్ పరీక్షలకు శిక్షణ ఇవ్వబడుచున్నది. శిక్షణ పొంద దలచిన విద్యార్థినీ, విద్యార్థులకు (వయసుతో నిమిత్తం లేదు) ఈ క్రింది అడ్రసుకు రూ. 13/- M.O. చేసి దరఖాస్తు పూర్తి వివరములు పొందవచ్చును.
గమనిక: హాస్టలు వసతి ఉచితము (భోజన వసతి కలదు)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వ్యవసాయ శాఖలలో ఫీల్డ్ మెన్/ఫీల్డ్ అసిస్టెంట్స్/ఫీల్డ్ సూపర్‌వైజర్స్/సబ్ అసిస్టెంట్/షుగర్ కేన్ ఇన్‌స్పెక్టర్ మొదలగు ఉద్యోగాలలో నియమించుటకుగాను అగ్రికల్చర్ పరీక్షకు 7th Pass to డిగ్రీ Pass/Fail అయిన విద్యార్థినీ విద్యార్థులకు పోస్టు ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వబడుచున్నది. జీతం: రూ. 1250/- నుంచి 1650/-ల వరకు పొందవచ్చును (వయసుతో నిమిత్తం లేదు) దరఖాస్తు ఫారము వివరములకు రూ.15/- M.O. చేసి పొందవచ్చును.

CORRESPONDENT
INDIAN TECHNICAL EDUCATIONAL SOCIETY
*Regd. By The Govt. of A.P. No.12/1988, D. No. 5/36-1, Postal Colony, A.K.Nagar,* ***NELLORE - 4.***

ఇంతలో కాఫీ తీసుకుని శోభ వచ్చింది. అన్నపూర్ణ లోపలకు వెళ్ళి పోయింది.

శోభ చెల్లెలూ తమ్ముడూ వచ్చి శాంతను అభినందించారు.

"మీ ఇంట్లో ఏమన్నారు?" అంది శోభ.

"మా అమ్మకు ఇలాంటి కష్టాలు మా అన్నయ్యకు రానేమిటా అని దిగులు. నన్ను మెచ్చుకుంటే తన పెద్దరికానికి భంగమనుకుంటాడు మా నాన్న. మా అన్నయ్యకు కుళ్ళుమోతు తనం, ఏడుపు..."

"చాల్లే వూరుకో. పిల్లల్ని పొగడ కూడదని అలా అంటారు గానీ లోపల చాలా సంతోషించి వుంటారు" అంది శోభ.

'నేను కూడా అలా సమాధాన పడ గలిగితే ఎంత బాగుండు' అనుకుంది శాంత.

"నీకు నిజంగా బాధగా లేదా? నువ్వు వెళ్ళి వుంటే నీకే వచ్చేది గదా ఈ పేరు." కాలేజీలో లెక్చరర్లు, ప్రిన్సిపాలు, తోటి పిల్లలూ అందరూ తనను అభినందిస్తుంటే ఉక్కిరిబిక్కిరవుతూ, తనతో పాటు సంతోషంగా తిరుగుతున్న శోభ నడిగింది శాంత.

"ఛీ - బాధేమిటి - పిచ్చి మాటలు మాట్లాడడంలో కూడా నీకే ఫస్టు ప్రైజు ఇవ్వొచ్చు."

అందరితో చెప్పలేదు గానీ శోభ శాంతతో స్వరాజ్యలక్ష్మి గారితో చెప్పింది.

మధురవాణి డైలాగ్సు ఇంట్లో చదువుతుంటే విన్నారట. అసలు నాటకంలోనే వెయ్యవద్దన్నారట. శోభ చాలా నచ్చజెప్పిన మీదట మధురవాణిగా ఒద్దు బుచ్చమ్మగా వెయ్యమన్నారట వాళ్ళ నాన్న. ఆ మాటలను కోపంతో కాకుండా శాంతంగా మేడమ్‌కి నచ్చచెప్ప డం చూసి శాంతకి చిర్రెత్తుకొచ్చింది.

శాంత ఒదిలిపెట్టలేదు. మళ్ళీ రెట్టించి అడిగింది. "నేను నేసినా మరొకరు నేసినా అబ్బాయిలు ఏడిపిస్తారు గదా- ఆ అవమానాలు ఎవరో భరించాల్సిందే గదా"

"మధురవాణిగా వేస్తే మీ వాళ్ళకేం నష్టం?" అనడిగింది వుండబట్టలేక.

"ఆ డైలాగ్స్ బాగోలేవని వాళ్ళ భయం. ఫంక్షన్‌కి వచ్చిన వాళ్ళు తర్వాత నన్ను మధురవాణి అనటం అబ్బాయిలెవరైనా ఆ డైలాగ్స్‌తో నన్ను వెక్కిరించటం యిదంతా వాళ్ళకు బాగోదు!"

"నీ తిప్పలు నువ్వు పడతావు గదా- వాళ్ళకేమిటి మధ్యలో"

"నేను తిప్పలు పడగూడదని వాళ్ళ ఉద్దేశం!"

"ఐతే నేను నేసి నేను తిప్పలు పడొచ్చా" శోభ నవ్వి వూరుకుంది.

"నేను భరించాల్సి రావటం మా అమ్మా నాన్నలకు యిష్టం వుండదు. వాళ్ళది భరించలేరు!"

"మా అమ్మానాన్న కూడా భరించ లేరు. మా అన్నయ్య అయితే ఇంట్లో పెద్ద చర్చ లేవదీస్తాడు. నన్ను చదువు మాన్పించేంత పనిచేస్తాడు. ఐనా సరే నేను మధురవాణిగా వేస్తాను!"

శాంత సంతంగా పలికింది.

"వెయ్యి- నేనొద్దన్నానా?"

"నువ్వలా అందరినీ ఎందుకు ఎదిరించవు? ఎదిరించకుండా ఎలా వుండగలుగుతున్నావు?"

"నాకిష్టం వుండదు. అమ్మానాన్నలు నా మంచి కోసమే చెబుతున్నారు గదా అనిపిస్తుంది. ఎదిరించాలనిపించదు. వాళ్ళు చెప్పినట్టు చేసి వాళ్ళను సంతోష పెట్టాలనిపిస్తుంది!"

ఆ మాటలు కూడా తొణకకుండా చెబుతున్న శోభను ఉక్రోషంగా చూసింది శాంత.

"నీ సరదాలన్నీ చంపుకుని-"

"సరదాలే గదా"-శోభ నవ్వేసింది.

చివరకు ఆ నాటకంలో శాంత మధురవాణిగా వేసింది. నవ్వు, కను బొమ విరుపు, చేతులు తిప్పటం అన్నీ శోభ దగ్గరే నేర్చుకుంది. నాటకం రోజు శాంతమీద ప్రశంసల వర్షం కురిసింది. ఊళ్ళోవున్న సాహితీవేత్తలూ, కళా కారులూ వచ్చారు. ఆ నాటకాన్నీ మధుర వాణిగా నటించిన శాంతనూ ఆకాశాని కెత్తారు.

శాంతకు శోభని చూస్తే ఏడుపొచ్చింది. శోభ ఆనందంగా శాంతను కావలించుకుని అభినందించింది.

ఆఖరి సంవత్సరంలో శోభ కాలేజీ ప్రెసిడెంటు ఔతుందనుకోవటంలో ఎవరికీ ఏ సందేహమూ లేదు. అసలు ఎన్నికల అవసరం కూడా లేదనుకున్నారు అందరూ. ఇంతలో ఎలా వచ్చిందో గాని బి.ఏ. వాళ్ళకూ బి.యస్సీ వాళ్ళకూ మధ్య తేడా వచ్చింది. ఒకరిద్దరి మధ్య ప్రారంభమైన ఘర్షణ కాస్త పెద్దదైంది. సంఖ్యా పరంగా చూస్తే బి.ఏ. వాళ్ళే ఎక్కువమంది. అందువల్ల వాళ్ళు ఈ సంతంలో భాగంగా బి.ఏ. వాళ్ళే కాలేజీ ప్రెసిడెంటు కావాలని అనుకున్నారు. బి.యస్సీ వాళ్ళు శోభ వెనుక నిలబడ్డారు. పోటీ తప్పలేదు. బి.ఏ. విద్యార్థినులు ముందుగా కరపత్రాలు తెచ్చి కాలేజీ అంతా పంచారు. మర్నాటికి తమకీ కర పత్రాలూ, టైంటేబుల్ కార్డులూ కావాల్సిందేనన్నారు బి.యస్సీ అమ్మాయిలు. ఇంటర్ వాళ్ళ ఓట్లనూ, మొదటి సంవత్సరం డిగ్రీ చదివే వాళ్ళ ఓట్లనూ సంపాదించటం ముఖ్యం. ప్రచారం లేకపోతే కుదరదు. కరపత్రాలు అచ్చే యించాల్సిందేనని అందరూ నిర్ణయించు కున్నారు. ఆ బాధ్యతంతా శాంత తీసు కుంది. వాళ్ళింటి పక్కనే ప్రింటింగ్ ప్రెస్ వుంది. మూడో సంవత్సరం బి.యస్సీ వాళ్ళంతా తలా కొంచెం చందా నేసుకుని ఐదొందలు పోగేశారు.

శాంతా శోభ సరస్వతి కలిసి టైం టేబిల్ కార్డులు డిజైన్ చేశారు. ఆ సాయంత్రం ప్రెస్ నుంచి ఆలస్యంగా యింటి కెళ్ళి తిట్లు తిన్నది శాంత.

మర్నాడు ఎనిమిదింటికే కాలేజీకి వచ్చేసింది. పదిమంది అమ్మాయిలు ఎనిమిదిన్నరకే వచ్చి కాలేజీ గేటు దగ్గర నిలబడి వచ్చినవాళ్ళకు వచ్చినట్టుగా కర పత్రాలు పంచాలనుకున్నారు.

వాళ్ళకంటే ముందుగా ఎనిమిది గంటలకే ఇంత పెద్ద కట్ట మోసు కుంటూ వచ్చింది శాంత.

తనకంటే ముందువచ్చి గేటు దగ్గర నుంచున్న శోభను చూసి నోరు తెరిచింది. శోభ ఎట్టి పరిస్థితుల్లోనూ తాను తొమ్మిదిన్నర కు ముందు రాలే నని గట్టిగా చెప్పింది. రాదని కూడా శాంతకు తెలుసు. కానీ వచ్చేసింది.

"నాసిలే తల్లీ- నీకిప్పటికైనా చురుకు పుట్టింది" అంది ఆ కట్ట శోభకు

# ఆ దండ



ఆగు అలా సంబరపడకు!
నీ మెళ్లో మెరిసే ఆ దండ
ఎవరిదని?

తలవంపుల పారవశ్యం ఎందుకని?
సాపేక్ష సన్మానాల కాభాష విను!


అది నిజం చెప్పినందుకు
వలచి వచ్చిన వరమాలా?
యుగవాణి గెలుచుకున్న
జనచైతన్యం జయమాలా?

కలల కల్లోలిత ప్రాంతంలో
కావ్యం గురి తప్పినందుకు
కవి సమయం కల్తీ అయినందుకు
ఆ దండ అస్మదీయుల ఆశ్లేష!

ఉప్పు కారం ఊరు మరచినందుకు
చీము నెత్తురు చేవ జారినందుకు
చిరునామా చిద్విలాసంగా మారినందుకు
ఆ దండ నీ మెడనిండ సార్థక వలయం

అదిమిపట్టినా అది రాజకీయాల రొద
దండధరుల నాటం కవికి అభిశాపం?
ఇకనైనా దండల పండుగ బహిష్కరించు
పుట్టిన పోరుపల్లిలో కవి కర్తవ్యం పూరించు

—జ్వాలాముఖి



అందిమ్మా.

శోభ ఆ కట్ట కిందకు దించి –

"శాంతా నేను పోటీ చెయ్యటం లేదు" అంది. శాంతకు ఒక్క క్షణం నోటమాట రాలేదు.

శోభా వాళ్ళింట్లో ఒప్పుకోరనే అనుమానం శాంతకు మొదటే వచ్చింది.

అందరూ శోభ ప్రెసిడెంటు అని అనుకునేటప్పుడే "మీ ఇంట్లో ఒప్పు కుంటారా?" అని అడిగింది.

"అమ్మనడిగి చెబుతాను" అంది శోభ.

అడిగింది కూడా- ఆనందంగా చెప్పింది.

"ఒప్పుకున్నారు. కాలేజీ పనులు తప్ప బైటపనులేవీ వుండవని చెప్తే ఒప్పు కున్నారు. 'అందరూ నువ్వే కావాలను కుంటే అలాగే కానివ్వమన్నారు'" అని చెప్పింది. శాంత ఆ రోజు శోభ తల్లి తండ్రుల గురించి తన అభిప్రాయం మార్చుకోటానికి కూడా సిద్ధపడింది.

అంతా కలిపి వారం రోజులుకాలేదు. ఇంతలో ఈ మార్పు. పైగా వాలుగైదొం దలు ఖర్చుపెట్టిన తర్వాత!

"ఎందుకు శోభా- మీవాళ్ళు ఒప్పు కున్నారుగా. ఇంతలో ఏమైందిట?"

శాంత కళ్ళనీళ్ళ పర్యంతమవుతూ అడిగింది.

"ఏ పోటీ లేకుండా ఎన్నికవుతానను కున్నారట- ఇద్దరు పోటీ పడడం, ఇలా కరపత్రాలు వేయించటం వాళ్ళకిష్టం లేదు. 'నీ పేరు అచ్చయి రోడ్ల మీద పడి నలుగుతుంటుంది. అందరూ తొక్కు కుంటూపోతారు. రేపు ఆ భారతి గోడల మీద రాయించి ప్రచారం చేస్తే నీ పేరూ గోడల మీద రాయాలంటారు. ఇంకెన్ని గొడవలొస్తాయో తెలియదు. ఏదో ఒక వంకతో మగపిల్లల కాలేజీలు కూడా ఈ ఎన్నికల్లో తలదూరుస్తాయి. రెండేళ్ళనాడు అలా జరిగి గొడవలయ్యాయి కదా అంటారు.' ఇప్పుడలాగైతే చాలాఅసహ్యం. నీపేరు నలుగురి నోళ్ళలో నానితే మేం ఎలా తలెత్తుకోగలం! రేపు నీకు పెళ్ళి కావాలాఒద్దా- 'ఇట్లా మాట్లాడారు. నేనేం చెయ్యను చెప్పు. వాళ్ళకసలు ఇష్టం లేకుండా నేనెట్లా పోటీ చేస్తాను" వివరంగానే చెప్పింది శోభ.

ఎప్పుడూ ఆందోళన ఎరగని ఆ అమ్మాయి ముఖంలో ఆందోళన చూసి శాంతకే జాలేసింది.

కానీ యిది నలుగురితో కూడిన పని. ముందు ఐదొందల రూపాయిల దాకా ఖర్చు చేశారు. వాటి సంగతేమిటి? అందరూ ఏమంటారు?

శాంతకు ఆందోళనతోపాటు భయం వేసింది.


మొదటిసారిగా శోభ క్లాసు ఎగ్గొట్టింది. ముఖ్యులనుకున్న ఫైనలియర్ అమ్మాయిలందరూ పొగడ చెట్టు కింద సమావేశమయ్యారు.


బి.ఏ. వాళ్ళను పోటీ లేకుండా గెలి పించటం ఎవరికీ ఇష్టంలేదు. శోభ కాకుండా మరెవరు పోటీచేసినా బి.ఏ. వాళ్ళ ఓట్లు చీల్చగలుగుతారనే నమ్మ కమూ లేదు. అసలు పోటీ చేసేందుకు మాత్రం ఎవరు సిద్ధంగా వున్నారు? ఇంటి దగ్గర ఇబ్బంది అందరికీ సమానమే. పోటీ చెయ్యకుండా గెలిపించడమా?

ఇదే ప్రశ్నగా కాసేపు దెబ్బలాడు కున్నారు.

పోటీ చేస్తే ఎవరు చెయ్యాల అనే విషయం మీద మరి కాసేపు వాదులాడు కున్నారు. ఈ ఐదొందల ఖర్చు సంగ తేమిటని కొందరు గట్టిగా అడిగారు.

శోభ ముఖంలో యింతవరకూ ఎప్పుడూ కనిపించని గిల్టీ ఫీలింగు చూసి శాంత గుండె నీరయిపోయింది. శోభ పక్షం వహించి గట్టిగా మాట్లాడింది.






"ఇంట్లో ఒద్దని గట్టిగా పట్టుబడితే మనం ఎవరమైనా ఏం చెయ్యగలం? మీ ఇంట్లో వాళ్ళు ఒప్పుకోరని మీరంతా యిప్పుడు చెప్పనే చెబుతున్నారు గదా- శోభ యిట్లా ఒద్దంటారని అనుకోలేదు. తీరా పోటీ అనేసరికి వాళ్ళమ్మా నాన్నలు భయ పడ్డారు. ఇంట్లో ఎదిరించి ఎలా పోటీ చేస్తుంది. ఎవరైనా అలా చెయ్యగల వాళ్ళు న్నారా? ఐదొందలు నష్టం అంటే నష్టమే మరి- తలా ఐదు పదీ భరించక తప్పదు. మీరు మరీ పట్టుబడితే శోభ ఎలాగో ఇంట్లో బతిమాలుకుని ఎవరి ఐదు రూపాయిలు వాళ్ళకు ఇచ్చేస్తుంది!"

శోభను అంత దీనంగా అంతసేపు చూడటం ఎవరూభరించలేకపోయారు.

శోభను ఒదిలెయ్యటానికీ ఐదొం దలు నష్టపోవటానికి ఎలాగో సిద్ధ మయ్యారు గానీ బి.ఏ. వాళ్ళకు ప్రెసిడెంట్‌షిప్ యివ్వటానికి మాత్రం ఎవరూ సుముఖంగా లేరు.

అందరూ కలిపి శాంత మీద పడ్డారు.

శాంత కనక పోటీచేస్తే ఐదొందలు కూడా నష్టపోమని తన ప్లాను చెప్పిందొక అమ్మాయి.

కరపత్రాలమీదా టైంటేబిల్ కార్డుల మీదా వున్న ఇంగ్లీషు అక్షరాలు కొంచెం మారిస్తే చాలు.

శోభ పేరు శాంతయిపోతుంది.

అక్షరాలు ఎలా మార్చాలో కూడా రాసి చూపించింది.

అదే పంచిపెట్టవచ్చని చెప్పటంతో అందరిలో కొత్త ఉత్సాహం వచ్చింది. ఒక్కరోజు స్కెచ్‌పెన్‌లు పట్టుకుని రంగు రంగులుగా ఆ పేరు దిద్దితే చాలు అనే పాయింటుతో యిక శాంత తప్ప మరో దిక్కులేదని గట్టిగా పట్టుబట్టారు. ఎలా గోలా తిప్పలుపడి శాంతను గెలిపిస్తా మన్నారు. శోభ కూడా శాంత చేతులు పట్టుకుని బతిమాలింది.

శాంత ఒప్పుకుంది. ఆరోజు సాయం త్రం క్లాసులు కూడా ఎగ్గొట్టి శాంత, శోభ, నందన, కళా అందరూ కలిసి శోభ పేరుని శాంతగా దిద్దేశారు.

తర్వాత పదిహేను రోజులూ కాలేజీ లోనూ ఇంట్లోనూ శాంతకు విశ్రాంతి అన్నది దొరకలేదు. కాలేజీలో ప్రతి అమ్మాయినీ ఒకటికి రెండుసార్లు కలిసి ఓటు అడగటం–

పిరియడ్‌కీ పిరియడ్‌కీ మధ్యన క్లాస్ రూంలకు వెళ్ళి అందరితో మాట్లా డటం–

మధ్యాహ్నాలూ, సాయంత్రాలు గ్రూపులూ గ్రూపులుగా అమ్మాయిల్ని సమావేశపరిచి మాట్లాడటం.

వీటితో పగలంతా సరిపోయేది.

సాయంత్రం ఇంటికెళ్ళేసరికిఆలస్యం అవనే అయేది. ఇంట్లో శాంత తల్లి మందొమ్మ సాధింపులు మొదలెట్టేది. తండ్రి నరసింహారావు వచ్చేవరకూ ఆవిడ డ్యూటీ మీద వున్న కానిస్టేబిల్‌లా శాంతను ఒదిలేది కాదు.

నరసింహారావు రాత్రి ఏ వేళకు వచ్చినా డ్యూటీ మర్చిపోని ఆఫీసర్‌లా శాంతను తిట్టేవాడు.

కాలేజీ మాన్పిస్తానని బెదిరించేవాడు.

అన్న శేషతల్పశాయి వెక్కిరింపులు వుండనే వుండేవి. కొత్తగా ఉద్యోగంలో చేరాడేమో తాను ప్రయోజకుడిననీ శాంత పనికి మాలినదనీ నిరూపించటా నికి పదే పదే ప్రయత్నించేవాడు.

ఆ పదిహేను రోజులూ ఇల్లంటే పోలీస్ స్టేషన్ అనిపించింది శాంతకు.

ఐతే పోలీస్ స్టేషన్‌లో చిత్రహింసలు పెట్టినా పోలీసులకు లొంగని, అప్రూ వర్‌గా మారని విప్లవకారుడిలా శాంత తలిదండ్రులకు లొంగలేదు. తిట్లకూ, వెక్కిరింపులకూ అవమానంతో దహిం చుకు పోతూనే ఆత్మగౌరవం కోసం పోట్లాడింది.

శోభా వాళ్ళ అమ్మానాన్నలు భయ

పడివట్టే మగ పిల్లల కాలేజీల మండి అబ్బాయిలు కొందరొచ్చారు. ముందు వాళ్ళు శాంత దగ్గరకే రావటం, ఆ సమయంలో శాంత పక్కన శోభ వుండటం ఎంతో మంచిదయింది. "మా చెల్లెళ్ళూ, చుట్టాల అమ్మాయిలూ ఉన్నారండి. వాళ్ళందరి ఓట్లూ మీకే వేయిస్తాం" అంటూ ఒచ్చారు ముందుగా ఒక కాలేజీ వాళ్ళు.

శాంత వాళ్ళతో ఏం చెప్పాలా అని కంగారు పడుతుంటే శోభ వాళ్ళను లోపలికి తీసుకొచ్చి విజిటర్స్ రూంలో కూర్చోపెట్టి మర్యాదలు చేసి సామరస్యంగా మాట్లాడింది.

"మీరు మాకు సహాయ పడాలని వచ్చారు. మాకు చాలా సంతోషంగా వుంది. కానీ రేపు మరో కాలేజి వాళ్ళొస్తారు. మీ సంగతి వాళ్ళతో చెబితే వాళ్ళు బి.ఎ. మంచి పోటీ చేస్తున్న భారతి పక్షాన వుండి ప్రచారం చేస్తామంటారు. మీ రిద్దరూ వీధుల్లో మా పేర్లతో కొట్టుకుంటారు. దానివల్ల మాకెన్ని సమస్యలొస్తాయో మీకు తెలియదు. అసలే మా ఇళ్ళల్లో భయపడుతున్నారు. మీరంతా దీనిని పెద్ద గొడవ చేస్తే చదివింది చాల్లే ఇంట్లో కూచోమంటారు. అందుకని దయచేసి మా ఎన్నికల్లో మీరు జోక్యం చేసుకోవద్దు. మాలో ఎవరం గెలిచినా మాకు సంతోషమే తప్ప అసూయ, విచారం లేదు. ఏదో సరదాగా పోటీ చేస్తున్నామే తప్ప ఒకరిమీద ఒకరికి కక్షలు లేవు."

శోభ యిలా సామరస్యంగా మాట్లాడుతున్నంతలో శాంత ప్రిన్సిపాల్‌ను వెంట బెట్టుకొచ్చింది. ఆవిడ కూడా వాళ్ళను తన రూంలోకి పిల్చి కూల్ డ్రింకులు యిచ్చి శోభ చెప్పిన మాటలనే మరింత వివరంగా చెప్పారు.

వచ్చినవాళ్ళు ఈ మర్యాదలకే మురిసిపోయారో, మాటలకే కన్విన్స్ అయ్యారో గాని మరేమీ అనకుండా అన్నిటికీ ఒప్పుకుని నవ్వుతూ వెళ్ళి పోయారు. ప్రిన్సిపల్ భారతిని కూడా పిల్చి మగపిల్లలు ఎవరొచ్చినా వాళ్ళను ఈ ఎన్నికల్లో జోక్యం కలిగించుకోనివ్వవద్దని గట్టిగా చెప్పారు.

కాలేజీలో వెయ్యిమంది విద్యార్థినులలో పోటీ చెయ్యాలంటే ఇంటా బయటా ఎన్ని ఇబ్బందులు ఎదుర్కోవాలో ఎంత పోరాటం చెయ్యాలో తెలిసొచ్చింది శాంతకు.

ఆ పోరాటం ఎంత అయిష్టంగా వుందో అంత యిష్టంగానూ వుంది.

శోభలా ఒద్దున నిలబడటం తన కెప్పటికీ రాదనుకుంటూనే ఆ పోరాటంలో మునిగిపోయింది శాంత. శాంత పేరున్న కరపత్రాలు ఎంత జాగ్రత్తగా పంచినా అబ్బాయిల చేతుల్లోకి వెళ్ళాయి. రాకెట్లుగా మారి మళ్ళీ శాంత మీదికే దూసుకొచ్చాయి. వాటి వెనక వెకిలి రాతలు వెధవ రాతలూ అన్నీ మామూలే.

కోపం, దుఃఖం, అవమానం-వీటన్నిటివల్లా పట్టుదల మరింత పెరిగి శాంత బలంగా నిలబడింది గాని మరింకెవరైనా అయితే జీవితంలో ఎప్పుడూ యిలా పబ్లిక్కున తమ పేరు కనపడటం అనే వూహనే భరించలేక పోయేవారు.

భారతిది కూడా అదే పరిస్థితి. ఐతే ఆ అమ్మాయికి యింట్లో అంత వ్యతిరేకత లేదు. ఆ పిల్ల తండ్రి ఆడపిల్లలు కూడా మనుషులే ననుకునే జాతికి చెందినవాడు.

శాంత ఇంట్లో అట్లాకాదు. నిత్యాగ్నిహోత్రం రగులుతుండేది. దానిలో రోజూ రకరకాల సమిధలు వేసేవాడు శాంత అన్న శేషతల్పశాయి.

"...దీని గురించి వాళ్ళిలా అనుకుంటున్నారు. వీళ్ళిలా అనుకుంటున్నారు..మరీ బరితెగించావు. నేను బజార్లోకెళ్ళి తలెత్తుకోలేకుండా వున్నాను..."అంటూ తల్లి ఎదురుగా నస పెట్టేవాడు. దాంతో సుందరమ్మ ఏడుపు మొదలెట్టేది.

శాంత అవమానంతో దహించుకు పోయేది. ఆ నెల రోజుల్లో రాత్రిపూట అన్నం తిన్న రోజులు అతి తక్కువ!

ఎలాగైతేనేం ఎన్నికలు జరిగిపోయాయి. శాంత గెలిచింది. శాంత కంటే శోభ ఎక్కువ సంతోష పడింది. ఐనా సరే ఆ రోజుకూడా ఐదింటికే ఇంటికి వెళ్లిపోయింది. శాంతా మిగిలిన స్నేహితులూ ఎంత బతిమాలినా ఆగలేదు. స్నేహితులందరూ కలిసి తలా కొంచెం డబ్బులు వేసుకుని స్వీట్లు తెప్పించి చిన్న పార్టీలా జరుపుకున్నారు.

శాంతకు గాలిలో తేలి పోతున్నట్టే ఉంది. అందరూ ఇళ్ళకు బయల్దేరినా ఇంటికి పోబుద్ధి కాలేదు. కానీ ఇంటికి వెళ్ళక తప్పదు-చివరి సారిగా ఈ విషయం గురించి తిట్లు తినక తప్పదు. అందరికంటే ఆలస్యంగా బయలుదేరి నిదానంగా నడిచి వెళ్తుంటే రాంకుమార్ కన్పించాడు. రాంకుమార్ కనిపిస్తే బాగుండునని శాంత సాయంత్రం నుంచీ అనుకుంటూనే వుంది.





రంగుల ప్రపంచంలో అద్భుతమైన ఇంద్రధనస్సు

**వీడియోటెక్**

* సాంకేతిక నిపుణతలో సాటిలేనిది.
* తక్కువ ధరలో మేలైన నాణ్యత.
* ఒక సంవత్సర కాలము ఉచిత సర్వీసు సౌకర్యము.
* పిక్చర్ ట్యూబ్‌పై 3 సంవత్సరములు గ్యారంటీ.
* గ్యారంటీ దాటిన తరువాత కూడా మా సర్వీసు సెంటర్లలో ఉచిత సర్వీసు సౌకర్యము.
* స్పష్టమైన ధ్వని, పిక్చర్ (తక్కువ ఓల్టేజిలో కూడా)
* V C R, V C P కనెక్షన్ A.C/D.C సౌకర్యములు.
* మీ ఎన్నికకు ఆకర్షణీయమైన ఎన్నో మోడల్స్.

**VIDEOTEK**

కలర్ - బ్లాక్ & వైట్ టి.వి.లు



**వీడియోటెక్ మార్కెటింగ్ సర్వీసెస్ (ఇండియా)**

స్వర్ణ కాంప్లెక్స్, 2 ఫ్లోర్, కాంగ్రెస్ ఆఫీసురోడ్, విజయవాడ-2

రాంకుమార్ ఏ.పి. కాలేజీ విద్యార్థి గానే కాక కవిగా నటుడిగా కూడా కాస్త పేరున్నవాడు. ఇంటర్ కాలేజి యేట్ నాటకాల పోటీల్లో డిబేటింగ్ పోటీల్లో శాంతకు తారసపడుతుంటాడు. ఈ మూడేళ్ళలో చాలాసార్లు కలిశారు. చాలా చక్కగా మాట్లాడతాడు. ఎక్కడెక్కడి విషయాలో చెబుతాడు. 'ఆ పుస్తకాలు చదివారా? ఈ పుస్తకాలు చదివారా' అంటూ ఎన్నో కొత్త పుస్తకాలు పరిచయం చేస్తాడు. అతనంటే ప్రత్యేకమైన అభిమానం ఏర్పడింది శాంతకు. శోభకు అతని గురించి చెప్పింది.

"మీ రాంకుమార్" అని ఆట పట్టిస్తుంటుంది శోభ. తన విజయాన్ని సంతోషంగా పంచుకోగల స్నేహితుడిగా సాయంత్రం నుంచీ మనసులో మెదులుతున్న రాంకుమార్ కనిపించేసరికి శాంత ముఖం వికసించింది.

అతనుకూడా ఎంతో ఉత్సాహంగా అభినందించాడు. "కాఫీ తాగుదాం రండి" అని ఆహ్వానించాడు. "ఒద్దండి" అన్నది కానీ శాంతకు అతనితో కలిసి కాఫీ తాగుతూ ఓ అరగంట కాలక్షేపం చెయ్యాలనేవుంది. కానీ 'ఎవరైనా చూస్తే' అనే భయం మనసులో వదలకుండా వెనక్కు నెడుతోంది.

"ఫరవాలేదు రండి - పది నిముషాలు. ఇవాళసలు మీరు కాఫీ యిప్పించాల్సింది పోయి నేను అడిగినా రానంటున్నారే"— అంటూ మొహమాట పెట్టాడు.

అయిష్టంగా నడుస్తున్నట్టు నడిచింది శాంత. కుర్చీలో కూర్చుని మంచినీళ్ళు తాగినా శాంత ముఖంలో యిబ్బంది తొలగి పోలేదు.

"మిమ్మల్ని ఇబ్బంది పెట్టినట్టున్నాను..." రాంకుమార్ శాంత ముఖం పరిశీలనగా చూసి అన్నాడు.

"కొంచెం-కొంచెమేమిటి లెండి...బాగా యిబ్బందే"

"ఏ రకంగా"

"మా వాళ్ళెవరైనా చూస్తే గొడవవుతుంది."

"ఇది డెబ్భయ్యవ దశాబ్దం. వీరేశలింగం గారు ఆడవాళ్ళకు కూడా జ్ఞానం కావాలని ఉద్యమం లేవదీసి వంద సంవత్సరాలు దాటింది. ఐనా మీరు ఇంట్లో గొడవవుతుందని భయ పడుతున్నారు..." ఇదేం బాగోలేదన్నట్టుగా అన్నాడు.

"జ్ఞానం కావాలన్నారు గానీ మగాళ్ళతో కలిసి హోటల్ కెళ్ళి కాఫీ తాగమన లేదుగదా" నవ్వింది శాంత.

"మరి జ్ఞానం ఎలా వస్తుంది?"

"ఏమిటీ—మీతో కలిసి కాఫీ తాగితే గాని నాకు జ్ఞానం రాదా?"

"జ్ఞానం రకరకాలు. మీరు కాలేజిలో చదివి జ్ఞానం సంపాదిస్తున్నారు. ఇలా హోటళ్ళా బజార్లా తిరిగి మన చుట్టూ వున్న సమాజాన్ని గమనించి కూడా జ్ఞానం సంపాదించవచ్చు. ఒకటి ఇంకోదానికి సహాయ పడుతుంది." రాంకుమార్ తమాషాగా నవ్వాడు.

"ఔను—మగపిల్లలు ఇంట్లో కూచుంటే 'బుద్ధావతారం! ప్రపంచ జ్ఞానం ఎలా వస్తుంది ఇంట్లో కూచుంటే?' అంటారు. ఆడ పిల్లల్ని మాత్రం వెయ్యికళ్ళతో కని పెడుతుంటారు గడపదాటకుండా—"

రాంకుమార్ మాట్లాడకుండా కాఫీ కప్పు అందుకున్నాడు.

"నాకు నిజంగా మీతో కలిసి కాసేపు కబుర్లు చెప్పుకోవాలని వుంది. కానీ మళ్ళీ భయం. తప్పు చేస్తున్నానేమో అనే అనుమానం. తప్పేమిటన్న తిరుగుబాటు—రెండింటికీ మధ్య పెద్ద యుద్ధం. నా అశాంతికి అంతుండదు. మా శోభ అలా కాదు. 'ఇది చెయ్యగూడని పని' అని దానికే తోచినా లేదా పెద్దవాళ్ళు చెప్పినా వెంటనే ఆ పని మానేస్తుంది. హాయిగా ఉంటుంది. నేనలా ఉండలేను. ఎప్పుడూ ఏదో ఒక సమస్యలో చిక్కుకుంటాను." శాంత గబగబా తన మనసులో నలుగుతున్న ఆలోచనలన్నింటినీ విప్పింది.

రాంకుమార్ ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

"నిజంగా నా బాధ మీకర్థం కాదు. ఓ కప్పు కాఫీ తాగటానికి యింత మానసిక యుద్ధం చెయ్యాల్సిన అవసరం మీకు లేదు. మీకది చాలా చిన్న విషయం. కానీ మాకలా కాదు. దీనికి కూడా మా మీద మేం ఎంతో పోరాటం చెయ్యాలి. మా కారెక్టర్ నంతా నిర్ణయించే అంశం ఈ కప్పు కాఫీయే అయినా ఆశ్చర్యం లేదు. 'ఆ అమ్మాయి ఎప్పుడూ అబ్బాయిల్తో కలిసి హోటళ్ళకు వెళ్తుంది' అన్న పేరు వచ్చేస్తే..నాకైతే బాగా చెడ్డపేరు తెచ్చుకోవాలనుంటుంది. చెడ్డపేరు తెచ్చుకోవడమంటే తిరగబడటం! నాకు అందరి మీదా అన్నిటి మీదా తిరగబడాలని వుంది."

రాంకుమార్ ఏం చెప్పాలో ఏం మాట్లాడాలో తెలియని వాడిలా కూర్చుండి పోయాడు.

"నేను వెళ్తాను" అంటూ లేచి గబగబా నడుస్తూ వెళ్ళి పోయింది శాంత.

ఆ సంవత్సరం మరికేం గొడవల్లేకుండానే గడిచిపోయాయి. శాంతా శోభా యిద్దరూ కలిసే పరీక్షలకు చదివారు. ఇద్దరికీ ఫస్టు క్లాసొస్తుందనే నమ్మకం వుంది, పై చదువులు చదవాలనే ఆశ కూడా వుంది గానీ శోభ ఆ విషయం కూడా తల్లిదండ్రులకే ఒదిలెయ్యాలని నిశ్చయించుకుంది.

శాంత అలా ఒదిలెయ్యలేదు గనక తల్లిదండ్రులతో యుద్ధానికి సిద్ధమవుతోంది. ఇద్దరిదీ మధ్య తరగతి కుటుంబాలే. ఆడపిల్ల పెళ్ళి చేసి భారం దిగిందనుకునే కుటుంబాలే.

శోభ పెద్దపిల్ల కావడంతోనేమో తలిదండ్రులు చాలా జాగ్రత్తగా డబ్బు కూడ బెట్టారు. శాంత తండ్రికి కొడుకు కట్నం అక్కరకొస్తుందనే ధీమా వుంది.

అందువల్లే శోభకు పెళ్ళి సంబంధాల కోసం అన్నపూర్ణ హడావుడి పడినంత సుందరమ్మ పడలేదు. శోభ పెళ్ళి చేసు కోటానికే సిద్ధపడుతుంటే శాంత ఆరాటంగా అడిగింది—

"ఐతే. నువ్వు ఎమ్మెస్సీ చదవవా?"

"ఏమో పెళ్ళి సంబంధం కుదరక పోతే-కుదిరినా వాళ్ళు ఒప్పుకుంటే-చదువుతాను."

శాంతకు శోభను పట్టుకుతన్నాలని పించింది.

"నీకు చదవాలని లేదా?"

"ఎందుకు లేదూ?"

"ఉంటే మరి ఇప్పుడు పెళ్ళి చేసు

## క్షమయా...

ఓ నా పవిత్ర భారత మాతా
జోహార్లు తల్లీ జోహార్లు
నీ అచంచల సహన శక్తికి
నా జోహార్లు
ఫిజీ పాలకుల ఉక్కు చట్టాల్లో
నలిగిపోతున్న నీ బిడ్డల్ని
చూస్తూ సహిస్తున్నందుకు.


మత కలహాల్లోంచి
కుల భాగోతంలోకి
ఎదిగిపోయిన మా అజ్ఞానాన్ని
మౌనంగా సహిస్తున్నందుకు
దినదినాభివృద్ధి చెందుతోన్న
లాకప్ మరణాల్ని
ఘనంగా పత్రికల్లో
చాటుకుంటోన్నందుకు

వరకట్నపు దావాగ్నిలో
పేటకో చీర కాలిపోతున్నా
కన్నీటి బొట్టు కూడా
కార్చలేకపోతున్న
నీ క్షమా గుణానికి

పదవుల కోసం దేశం పరువునే
పణంగా పెట్టే నేతల్ని
మాకిచ్చినందుకు
నిజంగా నీకు
నా జోహార్లు తల్లీ జోహార్లు

అయినా నా పిచ్చిగాని తల్లీ
నిన్ను రెండుగా చీల్చినపుడే
భరించిన 'క్షమయా ధరిత్రి'వి కదా!
ఇవన్నీ నీకో లెక్కా?

— పూర్ణిమ



పుస్తకాలకోసమైతే-హలో!
న్యూస్టూడెంట్ బుక్ సెంటర్ కొచ్చెలో!



| | | |
|---|---|---|
| పిల్లలకు ఆటలు-పాటలు | —ఎస్. మంగాదేవి | రు. 25-00 |
| క్విజ్ | —పాతూరి విజయకుమార్ | 15-00 |
| ఉదయశ్రీ | —జంధ్యాల పాపయ్యశాస్త్రి | 16-00 |
| కరుణశ్రీ | ,, ,, | 12-00 |
| విజయశ్రీ | ,, ,, | 10-00 |
| అమర్ ఖయ్యాం | ,, ,, | 16-00 |
| అరుణ కిరణాలు | ,, ,, | 12-00 |
| కరుణామయి | ,, ,, | 10-00 |
| తెలుగుబాల | ,, ,, | 5-00 |
| తెలుగువెలుగు వలం | —పురాణం సుబ్రహ్మణ్యశర్మ | 75-00 |
| సూర్యనేత్రం | —డా. సి. ఆనందరామం | 20-00 |
| **పిల్లల బొమ్మల తెలుగు నిఘంటువు** | N. మంగాదేవి | 55-00 |

**PHONES: Shop: 33332**
**Resi: 33335**

న్యూస్టూడెంట్ బుక్ సెంటర్
అరండల్‌పేట-మెయిన్ రోడ్,
గుంటూరు-2


కోవని అవొచ్చుకదా!''

''ఎందుకనాలి? ఎమ్మెస్సీ పాసైనా పెళ్ళి చేసుకోక తప్పదు గదా. ఇప్పుడొక వేళ మంచి సంబంధం వస్తే దానిని వదులుకోవడం ఎందుకు!''

'' మీ అమ్మలాగా మాట్లాడకు''-శాంత కోపగించుకుంది.

''మా అమ్మమాటలే యివి! నాకూ నిజమే అనిపించాయి. ఎంత చదివినా ఏ ఉద్యోగం చేసినా పెళ్ళి చేసుకోవాలి. పిల్లల్ని కని పెంచాలి. అదే ముఖ్యం కదా. అలాంటప్పుడు దానికే యింపార్టెన్స్ యిచ్చి ఆలోచించడం మంచిది కదా!''

శాంతేమీ మాట్లాడలేదు.

నాలుగు రోజుల్లో శోభను చూడడానికి పెళ్ళి వారొస్తున్నారని తెలిశాక యింకేముంది మాట్లాడడానికి?

పెళ్ళి మాపుల రోజు శోభ ఆందోళన ఆశ్చర్యంగా చూసింది శాంత. శోభ ఎన్నడూ ఎరగనిదీ ఆందోళన. అది పరీక్ష గానీ, పోటీ గానీ, నాటకం గానీ మరేదైనా గానీ అంతులేని విశ్వాసంతో స్థిరంగా నిలబడగల శోభఆకులా ఒణికి పోయింది.

ఏ చీరె కట్టుకోవాలి? బొట్టు పెద్దదా చిన్నదా! కాటుక పెట్టుకోవాలా లేదా?

లాకెట్ గొలుసు చాలా- నెక్లెస్ పెట్టు కోవాలా? ఒక్క జడా రెండు జడలా?

అన్నీ సందేహాలే- అన్నింటికీ భయమే!

అన్ని రకాలూ ప్రయత్నించింది. కాటుక పెట్టి కడిగేసింది. చిన్న బొట్టు పెట్టి మళ్ళీ దాన్ని పెద్దదిగా చేసింది.

''ఏదీ సరిగా చెప్పవేం'' అని శాంతను కసిరింది.

'' నువ్వెలా వున్నా బాగుంటావు. టెన్షన్ పడకుండా నవ్వుముఖంతో వెళ్ళు- పరీక్షకో పోటీకో వెళ్ళినట్టు వెళ్ళు... ..''

''వెధవ జోకు లెయ్యకు''-శోభ భయం మరికాస్త పెరిగింది.

పెళ్ళి కొడుకు డాక్టర్. ఇంత మంద మున్న పెద్దబోడుతో ముఖమంతా కప్పేసుకుని కూచున్నాడు.

శోభ వచ్చే దాకా అవీ యివీ మాట్లాడిన వాళ్ళు శోభ రాగానే ఆపి కళ్ళకు పని చెప్పారు. అందరి కళ్ళల్లోనూ తెచ్చిపెట్టుకున్న తిరస్కారం.'ఆ, ఏదో వుందిలే' అన్నట్టు చూస్తున్నారు. శోభ నెవరైనా అట్లా చూడగలరని శాంత కలలో కూడా అనుకోలేదు. శోభ అందం, చిరునవ్వు, తెలివి అన్నిటినీ లెక్కలేనట్టుగా చూస్తున్నారు.

కాసేపు మౌనం రాజ్యమేలింది. ఎవరూ ఏమీమాట్లాడకుండా మూతులు బిగించి కూచున్నారు.

''మీరేం చదువుతున్నారు?''

చివరకు శోభే తన పక్కన కూచున్న పెళ్ళికొడుకు చెల్లెల్ని అడిగింది. అది పెద్ద అపరాధమై పోయింది. ఆ అమ్మాయి ఆ సంవత్సరమే ఇంటర్ పరీక్ష రాసి తప్పింది. రెండు రోజుల క్రితమే రిజల్ట్సు వచ్చాయి. ఆ పిల్లకేం చెప్పాలో తెలియక ముఖం మాడ్చుకుంది.

పెద్దావిడ ముఖంలో అసహనం కొట్టొచ్చినట్టు కనపడింది.

వాతావరణం ఇబ్బందిగా మారడంతో శోభ బాగా కలవరపడింది.

'' ఇక మేం వస్తాం''అంటూ లేచింది పెళ్ళి కొడుకు తల్లి. ఆమెతోపాటు అందరూ లేచారు. వాళ్ళంతా వెళ్ళాక అన్నపూర్ణ కూతుర్ని బాగా చివాట్లు పెట్టింది.

''వాళ్లేవో అడుగుతారు నువ్వు చెప్పాలి. అది పద్ధతి! నీకేమిటా తొందర? ఆ పిల్ల ఏం చదివితే నీకెందుకు? పెద్దఆరిందలా బయల్దేరావు!''ఎవరూ మాట్లాడక పోతే మర్యాదగా వుండదనివూరికే పలకరించా అని మొత్తుకుంది శోభ.

''చాల్లే వూరుకో- నీ మర్యాద మండి వట్టే వుంది. నువ్వేనా మర్యాదలు చేసేది. మేం చచ్చామా?''

ఇట్లా సాగింది ఆమె ధోరణి.

శోభ ఏడుస్తూ పడుకుంది. శోభ కళ్ళనీళ్ళు పెట్టడం మొదటిసారి చూసింది శాంత. ఎవరిచేతా ఏ మాట పడని శోభ-ఎవరినీ నొప్పించని శోభ-తన తప్పేమీ లేకుండా ఏడవాల్సి రావడం కేవలం శాంతకు అర్థమయింది. పది రోజుల్లో పిల్ల నచ్చలేదని ఉత్తరం వచ్చింది. ఓటమి ఎరుగని శోభ మొదటిసారి ఓడిపోయింది. శోభ ఓటమి శాంతనసలు ఆ పరీక్షకే విముఖురాలిని చేసింది.

అన్నపూర్ణ, రాఘవరావుల హడావుడి పెరిగింది. నెల తిరక్కుండానే యింకో సంబంధం తెచ్చారు. అబ్బాయి ఎమ్మెస్సీ పాసై హైదరాబాద్‌లో రీసెర్చ్ లాబ్స్‌లో సైంటిస్ట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు.

ఈసారి పెళ్ళిచూపుల్లో శోభదించిన తల ఎత్తలేదు.

చదువుకున్నప్పటికీ శోభ ఎంత వినయ విధేయతలు గల అమ్మాయో, ఇల్లు చక్కదిద్దుకోవడంలో ఎంత నేర్పరో చెప్పిన మాట చెప్పకుండా వర్ణించి

చెప్పారు అన్నపూర్ణ రాఘవరావులు. పెళ్ళి కొడుకు తరఫువాళ్ళు శోభ తమకు వచ్చిందని అక్కడికక్కడే చెప్పేశారు. పెళ్ళి కొడుకు తల్లి బోళా మనిషిలా వుంది,'పిల్లకేం బంగారంలా వుంది'అనే సింది.

"బయటిబాధురి కట్స్ వున్నాయరని పెళ్ళికొడుకు చెల్లెలు.

అందరూ సంతోషపడ్డారు.

ముహూర్తాలు పెట్టుకుందామనుకు న్నారు.

శోభ ఉత్సాహంగా పెళ్ళి బట్టలు కొనుక్కుంది. నగలు చేయించుకుంది. శుభలేఖలు పంచింది. పెళ్ళికూతుర యింది.

నుదుటి మీద పెట్టుకునే గొలుసూ, వొడ్డాణం- వీటి కోసం బంధువులనూ స్నేహితులనూ అడిగి చివరికి సంపాదిం చింది.

అవి పెట్టుకోకపోతే అందమే లేదంది. అడ్వర్టైజ్ మెంట్లలోనూ, సినిమా బొమ్మల్లోనూ కనిపించే పెళ్ళి కూతుళ్ళ బొమ్మలన్నీ కత్తిరించి పరి శీలించసాగింది.

ఏ బొట్టు పెట్టాలి? ఏ కలర్ చీర?

ఏ నగలు? గోరింటాకు పెట్టాలా? నెయిల్ పాలిష్? పాదాలనేం చెయ్యాలి? ఎంత వాజూగ్గా అలకరించాలి? గాజుల సంగతేమిటి?

కనుబొమలో...

ఒక వ్యాసం తయారు చేయడానికో ఒక ఉపన్యాసం తయారుచేసుకోటానికో ఎంత శ్రమపడేదో, ఎన్ని పుస్తకాలు వెతి కేదో, ఎలా కష్టపడి సాధించేదో యిప్పుడు కూడా అలాగే కష్టపడింది.

ఒకటే తేడా- ముందు వాటి కోసం టెన్షన్ పడేది కాదు. ఈ పెళ్ళి కూతు రు వేషానికి మాత్రం విపరీత మైన ఆందోళన.

పెళ్ళిరోజు నిజంగానే సినిమా స్టార్ల ను తలదన్నేలా తయారైంది.

పెళ్ళంటే ఈ అలంకరణే అనుకుం టోందా అన్నట్లు తయారైంది.

శాంత కదంతా పెద్ద బోగస్‌గా అనిపించింది.

'శోభ గురించి వీళ్ళకెవరికీ తెలి యదు. పెళ్ళి కొడుక్కి అసలు తెలి యదు. బుట్టబొమ్మలా వున్న ఈమె శోభ కాదు.'

'శోభ యిక క్రమంగా చచ్చిపోతుంది కాబోలు!'తన ఆలోచనకు తానే ఉలిక్కి పడింది.

రేపటి నుంచి శోభ కాలేజీకి రాదు.

లైబ్రరీలో పుస్తకాలు వెతకదు.

ఆటలు ఆడదు. పాటలు పాడదు. ఉపన్యాసాలు యివ్వదు. నవ్వరుబ్బు తుంది. తాలింపు వేస్తుంది. రుచులు చూస్తుంది. ఇంత పెద్దపొట్ట వేసుకుని పిల్లల్ని కంటుంది. ఈ పనులన్నీ చేసి నందుకు ఎవరూ గౌరవించరు. కాలేజీ లో శోభకున్న గుర్తింపు వంటింట్లో శోభ కుండదు. శాంతకు పెళ్ళి పందిరిలోంచి పారిపోయి ఎక్కడన్నా ఒంటరిగా కూచొని ఏడవాలనిపించింది.

పెళ్లయిన పదిరోజుల్లోనే శోభ భర్తతో కలిసి హైదరాబాదు వెళ్ళి పోయింది.

వెళ్ళే ముందు శాంతా వాళ్ళ యింటికి వచ్చింది.

ఇద్దరూ ఏవేవో ఎడతెగని కబుర్లు చెప్పుకున్నారు.

"ఆయనా నువ్వూ మంచి ఫ్రెండ్స్ అయ్యారా?"అని అడిగింది శాంత-

శోభ జీవితం ఈ పది రోజుల్నించి ఎలా వుందో తెలుసుకోవాలనే కుతూహ లంతో-

"ఫ్రెండ్సేమిటి? ఆయనంటే నాకింకా భయం పోలేదు" అంది శోభ కొత్త భయంగా.

"భయమా?" శాంత ఆశ్చర్యంగా అడిగింది.

"ఆఁ! భయంగానే వుంది. ఆయన క్కాస్త కోపం ఎక్కువే. ఎందుక్కోపం వస్తుందో నాకింకా తెలియడంలా. నెమ్మ దిగా ఆయనకే పనులు యిష్టమో, ఏవి కాదో తెలుసుకోవాలి." శోభ తన ముందొక మహత్తర కర్తవ్యాన్ని దర్శిస్తు న్నంత భయభక్తులతో చెప్పింది.

"ముద్దు పెట్టుకునేటప్పుడు కూడ భయంగానే వుంటుందా?"

శాంత హఠాత్తుగా హడా వుడిగా అడి గింది.

"ఛీ - ఫో" అని సిగ్గు పడింది శోభ.

"నిజంగా తెలుసుకోవాలని అడుగు తున్నా. ముద్దు పెట్టుకుంటున్నపుడు కూడా భయంగా వుంటుందా?" ఆరా టంగా అడిగింది శాంత.

"ఊఁ - కొత్త భయంగానే వుంటుం ది".

"సెక్స్ ఎలా వుంటుందే - బాగుం టుందా?"

"ఏమో - నాకేం తెలియదు. కొత్త చికాగ్గా ఉంటుంది. ఆ కాసేపూ త్వరగా పూర్తయితే బాగుండుననిపిస్తుంది."

ఇబ్బందిగానే చెప్పింది శోభ.

"మరి కథల్లో నవలల్లో అట్లా రాస్తా రేం."

శాంత ఎక్కడో ఆలోచిస్తోంది.

"అంతా అబద్దం"- శోభ వొక్కి చెప్పింది.

"అందరూ అబద్ధాలే రాస్తారా".

"మగాళ్ళకి బాగుంటుందనుకుంటా - వాళ్ళేగా రాసేది - ఇంకా గొడవ సినివ్వు -

నువ్వేమిటి - ఇంకా చదువుతావా?"

"ఇక్కడ పి.జి. సెంటర్లో సీటు వస్తే చదువుతాను. ఇక్కడ సీటు రాక పోతే వైజాగ్ వెళ్ళి చదివే అవకాశం మాత్రం లేదు."

ఇంతలో శాంత తల్లి వచ్చింది.

"ఏమ్మా శోభా..అత్తవారింటికి వెళ్తు న్నావా? మా శాంత కా అదృష్టం ఎప్పుడో" అంటూ అక్కడే నతికిల బడింది, స్నేహితులిద్దరి ఇబ్బందీ గమనించకుండానే.

"ఐతే మీ ఆయనకెంత కట్నం యిచ్చారూ?" అంటూ కబుర్లు మొదలు పెట్టింది.

"నీకెందుకు వూరుకోమ్మా" అంటూ శాంత కసిరినా పట్టించుకో లేదు.

"మా నాన్నగారు నా పేరు మీద లక్ష రూపాయలు బ్యాంకిలో వేశారండి" శోభ మర్యాదగా చెప్పింది.

"మీ ఆయనకేం కొనివ్వలేదూ? స్కూటరో, మరోటో".

"స్కూటర్ యిచ్చారండి. ఇంటి క్కావాల్సిన సామాన్లూ, ఫర్నీచర్ అంతా మా అమ్మ 'ఎప్పుడో సిద్ధం చేసింది. అవన్నీ తీసికెళ్తున్నాను."


ఫర్నిచర్ సంగతీ సామాను సంగతి శాంతకు మూడు సంవత్సరాల నుంచీ తెలుసు.

శోభ తల్లి అన్నపూర్ణ ఎప్పుడూ రెండో మూడో చీటీలు కడుతుండేది.

ఆ డబ్బు వచ్చినప్పుడల్లా - బీరువా, సోఫా కంబెడ్, డబుల్ కాట్, ఫ్రిజ్- యిలా ఒక్కొక్కటే కొనేది.

అన్నీ వాళ్ళింట్లో వున్నవే.

"మళ్ళీ ఎందుకు కొన్నారండీ. ఇంట్లో వున్నాయిగా" అనడిగేది శాంత మొదట్లో తెలియక.



## అగ్ని ఉత్సవం

వైశాఖపు ఎండల  
విశాలమైన గుండెలమీద  
మేను వాల్చాను నేను.  
వేయి నాల్కల జ్వాలలో  
దందహ్యమైనాను.  
ఈ అగ్ని ఏ అరణిదో  
ఎరగను నేను  
నా ఆకలే ఇంధనంగా  
ఆహుతయ్యాను.  
నన్ను నిశ్శేషం చేసుకుని  
నా వెర వదిలించుకునే  
ఏ అవకాశమూ వదలను నేను  
నిప్పు, నీరు, గాలి, భూమి, వ్యోమం  
నేను తాకితే నిఖిలమూ  
ఖిలమైపోవలసిందే.  
నా సర్వావశేషాలూ  
బూడిద రాసులుగా కానవస్తాయి.  
అందులో వెతకండి.  
కాలిన ఎముకల మీద  
అత్యుష్ణమైన అగ్నితో  
లిఖించిన అక్షరాల్లో  
వుంటుంది నా పేరు.

ఒరియా మూలం:  
సచి రౌత్ రాయ్  
తెలుగు అనువాదం:  
కె. గోదావరిశర్మ

"శోభకమ్మా - పెళ్ళి నాటికి అన్నీ సిద్ధంగా వుంటే మన పని కాస్త సులువవుతుంది" అనేది అన్నపూర్ణ. కొన్ని వస్తువులన్నీ జాగ్రత్తగా గుడ్డలు కప్పి దాచేది. ఈ పెద్ద వస్తువులే ఈ మూడు సంవత్సరాల్లో ఏర్పాటు చేసింది. మిగిలిన చిల్లర మల్లర సామానంతా శోభ ఏడో యేట నుంచి పోగు చేసింది.

శోభ ఒకసారి చెప్పింది.

"మా అమ్మ మా కోసం ఎంత ఆలోచిస్తుందో చెప్పలేను శాంతా. ప్రతి క్షణం మా గురించే - నా ఏడో యేట మా అమ్మ యింట్లో వున్న చిన్న చిన్న వెండి గిన్నెలు కుంకుమ భరిణలూ చెడగొట్టి మరి కొంచెం డబ్బులేసి వెండి పూల బుట్ట చేయించింది. మా అమ్మమ్మ అమ్మకు పట్టు చీర కొనుక్కోమని యిచ్చిన డబ్బులవి. మా యింట్లో అప్పటికే వెండి పూల బుట్ట వుంది. మళ్ళీ ఎందుకమ్మా అంటే నీకేనమ్మా పెళ్ళి నాటికి ఒక్కొక్కటే పోగు చెయ్యొద్దూ అంటుంది.. ఎప్పుడే కొత్త రకం సామానొచ్చినా ముందునా కోసం ఆలోచిస్తుంది. మా అమ్మంటే నా కెంత యిష్టమో... ...

మా అమ్మను నొప్పించే పని ఎప్పుడూ చెయ్యగూడదనిపిస్తుంది."

శోభ మాటలు విన్న శాంతకు మెదడంతా అల్లకల్లోలమయింది. శోభ ప్రేమ అంటూ చెబుతున్న విషయం శాంతకు ఘోరంగా కనపడింది.

"ఏంటో నాకేం బాగోలేదే" అంది శాంతిగా.

"ఏం బాగోలేదూ? మా అమ్మ నా గురించి ఆలోచించడమా, నేను మా అమ్మను ప్రేమించడమా? నువ్వు నిజంగా పిచ్చిదానివి" అంది శోభ నవ్వుతూ.

"అది కాదే - మీ అమ్మ అట్లా సామాను కొంటూ వుంటుంది నీ కోసం. అంటే ఆ సామానుతో నువ్వు వేరే యింటికి వెళ్ళాలనేగా -'నువ్వు మా ఇంటి అమ్మాయివి కాదూ. నీ సామానంతా నీకు వేరుగా పెడుతున్నాం' అని చెబుతున్నట్టుగా వుండదూ? నీకు దిగులుగా వుండదూ?

మా అమ్మ గనక అట్లా చేస్తే ఆ సామానంతా బద్దలు కొడతాను."

"భలేదానివే - సామాను కొన్నా కొనక పోయినా మనం ఎల్లకాలం యిక్కడే వుంటామా? మన అత్తగారింటికి మనం వెళ్ళమా?"

"అమ్మగారిల్లూ, అత్త గారిల్లూ - ఈ రెండేనా మనకు? మనకంటూ ఓ యిల్లుంటే బాగుండదూ? ఆ యింట్లో సామాను మనక్కావల్సింది మనమే కొనుక్కుంటే బాగుండదూ?" ఆలోచనగా అంది శాంత.

"ఆ ఇంట్లో ఒక్కదానివే వుంటావా?" శోభ ఆశ్చర్యపడింది.

"ఔను నేనొక్కదాన్నే వుంటాను. నా ఇష్టం వచ్చినట్టు వుంటాను. నా యిష్టం వచ్చినంత సేపు చదువుకుంటాను. ఇష్టమైనపుడు తింటాను. ఎప్పుడు పడుకోవాలనిపిస్తే అపుడు పడుకుంటాను. ఎపుడు లేవాలనిపిస్తే అపుడు లేస్తాను. నా ఇంటికి నా కిష్టమైన వాళ్ళందరినీ పిలుస్తాను. నా కిష్టంలేని వాళ్లను ఇంట్లోకి రానివ్వను." ఎక్కడో కలలో వుండి మాట్లాడినట్టు మాట్లాడింది.

"ఎవర్నీ రానివ్వవా? మీ రాంకుమార్ని కూడా?" పకపకా నవ్వింది శోభ.

అదంతా గుర్తొచ్చిందిపుడు.

"బండెడు సామానుతో వెళ్తుంది శోభ అత్తగారింటికి" అంది నవ్వుతూ.

శోభ వెళ్ళడానికి లేచింది.

"రేపు ఉదయం మా ఇంటికి రా శాంతా" అని ఆహ్వానించింది.

"ఎందుకూ? మీ ఆయన్ని పరిచయం చేస్తావా" అంటూ నవ్వింది శాంత.

సుందరమ్మ శోభకు బొట్టు పెట్టి నాలుగరటి పళ్ళూ తమలపాకులూ చేతిలో పెట్టింది.


ఆ రాత్రంతా శాంతకు నిద్ర పట్టలేదు. "శోభ ఈ పాటికి భయం భయంగా మొగుడి పక్కన చేరి వుంటుంది. అతను ముద్దు పెట్టుకుంటాడు. శోభ భయంతోనే ముద్దు పెట్టించుకుంటుంది. ముద్దు పెడితే ఎలా వుంటుంది? భయం తప్పేమీ వుండదా?"

శాంత శరీరం మనసూ వింత అలజడికి లోనయ్యాయి.

రాంకుమార్ గుర్తొచ్చాడు.

'రాంకుమార్ తనను ముద్దు పెట్టుకుంటే-'

'అబ్బ - ఏమిటీ ఆలోచనలు. నాకు



# Whatever be the ambient temperature, it suits me.



**Special Features:**

* Perfect insulation which improves the cabinet temperature.
* Sturdy ABS liner.
* Dependable in service.
* Highly energy efficient
* Spacious storage capacity.
* Built to last
* Sleek and strong.
* Range of exterior finishes with dazzling interior colour schemes.
* Widest range of models.



**Kelvinator®**
**Refrigerators**

**Available on easy instalments.**
**Contact personally with Salary Certificate.**



**Kelvinator**
Refrigerator
"It's the coolest one"

AUTHORISED STOCKIST:
**BUYWEL AGENCIES,**
Kachiguda Station Road, Hyderabad-500 027
**Ph: 44691/557504.**


పిచ్చెక్కుతోంది' అనుకుంటూ జుట్టు పీక్కుంది. గట్టిగా కళ్ళు మూసుకుని నిద్ర పోవాలని ప్రయత్నించింది.

మర్నాడు ఉదయం ఎంత కంట్రోలు చేసుకున్నా శాంతకు సాధ్యం కాలేదు. సాంబశివపేటకే కాళ్ళు లాక్కెళ్ళాయి.

ఒద్దు ఒద్దని గట్టిగా అనుకుంటూనే రాంకుమార్ గదికి వెళ్ళింది.

గది తలుపులు బార్లా తెరిచి వున్నాయి. అతను మంచం మీద అడ్డంగా పడుకుని పుస్తకం చదువుకుంటు న్నాడు.

శాంతను చూసి విపరీతంగా ఆశ్చర్య పోయాడు. మూడేళ్ళుగా పరిచయం వున్నా, ఏడాదిగా స్నేహం కాస్త పెరి గినా అతను శాంతను తన గదికి రమ్మనలేదు. శాంత అతన్ని తన ఇంటికి పిలవ లేదు. అసలా ప్రస్తావనే రాలేదు. ఇప్పుడు హఠాత్తుగా శాంత వచ్చేస్తే రాంకుమార్‌కి ఒక్క క్షణం అయోమయంగా అనిపించింది.

అంతలోనే తేరుకుని –

"రండి. రండి" అంటూ హడావుడి చేశాడు.

"ఏంటి చదువుతున్నారు" అంది శాంత కూర్చుంటూ.

"ఒక్క నిముషమండి. నేనింకా ముఖం కడుక్కోలేదు." హడావుడిగా బాత్‌రూంకి పరిగెత్తి ముఖం కడుక్కొచ్చాడు.

"తొమ్మిది దాటింది. ఇప్పటి దాకా ఏం చేస్తున్నారు"

"ఇదిగో- ఈ నవల చదువుతున్నాను. చాలా బాగుంది. టైమ్ తెలియలేదు" ఆ నవల చేతిలోకి తీసుకున్నాడు.

"ఏం నవలది?" శాంత ఆసక్తి లేకుండానే అడిగింది. ఆమె తన మనసులో రేగే కల్లోలాన్ని అణిచే పనిలోనే వుంది.

"వాట్ ఈజ్ టు బి డన్- తెలుగులో యింకా తేలిగ్గా చెప్పవచ్చు. ఏం చెయ్యాలి. రష్యన్ నవల."

"అంత గొప్ప నవలా? దేన్ని గురించి?"

"ప్రేమ గురించి, పెళ్ళి గురించి-ఈ నవలలో వేరా అనే అమ్మాయికి యిల్లొక జైలులా వుంటుంది. ఏ మాత్రం స్వేచ్ఛ వుండదు. అమ్మాయి పాలిట అది నరకం. తల్లిదండ్రులు యమదూతలు. ఎలాగైనా ఆ నరకం లోనుంచి తప్పించుకోవాలని అనుకుంటుంది.

ఆమె తమ్ముడికి పాఠాలు చెప్పటానికి వచ్చిన మాస్టారితో పరిచయం ఏర్పడుతుంది. తనకూడా ఆడవాళ్ళ స్వేచ్ఛ గురించి ఆలోచించేవాడు కావడంతో యిద్దరూ మంచి స్నేహితులవుతారు.

"వేరాను ఆ నరకంలోంచి తప్పించి పెళ్ళాడతానంటాడతను. వేరా ఆ స్వేచ్ఛా జీవితం గురించి ఎన్నో కలలు కంటుంది. పెళ్ళయ్యాక తమ జీవితం ఎలా వుండాలో చెబుతుంది. ఇద్దరూ ఎవరి గదులలో వాళ్ళుండాలి. ముందుగా అనుమతి లేకుండా ఒకరు యింకొకరి గదిలోకి రాకూడదు. ఎవరి పని వాళ్ళు చూసుకోవాలి. ఎవరి జీవితం వారికుండేలా బతకాలి. ఇట్లా చాలా ఆధునికమైన ఆలోచనలు చేస్తుంది వేరా. అలాగే బతుకుతారు కూడా. ఆ అమ్మాయి సహకార కుట్టుపని సంస్థ నొకదానిని నిర్వహిస్తుంది. అందులో వచ్చే లాభాలు పని చేసే వారందరికీ పంచుతుంది. జీవితం ఎంతో హాయిగా గడుస్తుంది. కానీక్రమంగా వేరాకు అర్థమవుతుంది..ఆ మాస్టారి మీద తన కున్నది కృతజ్ఞత తప్ప ప్రేమకాదని. తాను ఆ మాస్టారి స్నేహితుడిని ప్రేమిస్తున్నానని కూడా ఆమెకు అర్థమవుతుంది. ఈ సంగతి మాస్టారికెలా తెలియజెయ్యాలో, అతన్నెలా బాధపెట్టాలో తెలియక సతమతమవుతుంది వేరా. చివరకు ఉత్తరం రాస్తుంది. ప్రేమకూ స్నేహానికీ మధ్య నలిగి పోతుందామె. విషయం గ్రహించిన మాస్టారు తాను అక్కడ నుంచి తప్పుకుంటాడు. వేరాకు తన బంధం లేకుండా చేస్తాడు. వేరా తన ప్రియుడితో కలుస్తుంది."ఆగాడు రాంకుమార్

"తర్వాత"-శాంత కథలో లీనమయింది.

"తర్వాత మీరొచ్చారు. రాత్రి నుంచీ వదలకుండా చదువుతున్నానిది."

"ఎవరి గదులలో వాళ్ళు - భార్యాభర్తలు అస్తమానం ఒకరి కొకరు కనపడకుండా ఎవరి గదులలో వాళ్ళు! ఎంత బాగుందో ఆ ఆలోచన"-శాంత అంది.

"మీరు పెళ్ళి చేసుకోబోయే వాడికి అదే షరతు పెట్టండి."

"ఆ షరతు పెడితే నాకు చచ్చినా పెళ్ళి కాదు. కాకపోయినా సంతోషమే లెండి. నాకు పెళ్ళి చేసుకోవాలని లేదు" నవ్వింది.

"ఆ షరతుకి ఒప్పుకునే మగాడు ఈ భూమ్మీద పుట్టి పెరగడని నా గట్టి నమ్మకం."

"పుట్టి పెరిగి మీ కళ్ళముందే కూర్చున్నాడనుకోండి. ఏం చేస్తారు? "

రాంకుమార్ చనువుగా శాంత చెయ్యి పట్టుకున్నాడు. శాంతకు ఒళ్ళంతా జలదరించినట్లయింది. కంగారుగా

Why buy something When you can buy the best.

GNAL

Narmada 150 PRINCE

a choice of conscious buyer



For further details Contact:
The Dy. Marketing Manager,
Gujarat Narmada Valley Fertilizers Co. Ltd.,
C-111, Vijaya Towers,
Nagarjuna Nagar Colony,
Ameerpet, Hyderabad - 500 873
Ph: 225594

Tough! So you can depend on it.


రాంకుమార్ ముఖం చూసింది.

"శాంతా! నాకు మీరంటే యిష్టం. మీ ఆలోచనలు నాకు నచ్చుతాయి. మనం ఈవిషయం గురించి ఎందుకు మాట్లాడుకోగూడదూ? కనీసం ఆలోచించ నన్ను గదా?"

శాంత మాట్లాడకుండా కూచుంది. ఆశ్చర్యం నుంచి బైటపడలేక సతమత మవుతూంది.

"మీకుఇష్టం లేకపోతే మాట్లాడనవసరం లేదు..." శాంత నెమ్మదిగా కూడదీసు కుంది.

"నాకు చాలా ఆశ్చర్యంగా వుంది. ఏం మాట్లాడాలో తెలియడం లేదు. నేను యిక్కడికి ఎందుకు ఎలా వచ్చానో మీకు తెలియదు... ..."

"ఎందుకొచ్చారు?"

"మా శోభకు పెళ్ళయింది."

"ఔను నాకు తెలుసు. మీరే చెప్పారు--"

"దానిభర్త ముద్దుపెట్టుకుంటుంటేదానికి భయం వేస్తుందని చెప్పింది..."

"ఊఁ" రాంకుమార్ ఆశ్చర్యంగా చూస్తు న్నాడు. "నాకు రాత్రంతా నిద్రపట్టలేదు...ముద్దు పెట్టుకుంటే భయం తప్ప ఏమీ అనిపించదా అని. ఆక్రమంలో మీరు గుర్తొచ్చారు. మిమ్మల్ని ఎంత నెట్టివేయాలని ప్రయత్నించినా నా వల్ల కాలేదు. ఇక్కడికి రాకుండా వుండలేక పోయాను ... ..."

శాంత ఎదురుగా వున్న గోడమీద క్యాలెండర్‌ని చూస్తూ మాట్లాడు తోంది.

రాంకుమార్ శాంత పక్కన కూచున్న వాడు లేచి కొంచె ముందుకి వంగి శాంత పెదవుల మీద ముద్దుపెట్టుకున్నాడు. శాంతకు తలంతా గిర్రున తిరిగినట్ట యింది. కుర్చీని గట్టిగా పట్టుకున్న ఆమె చేతులు రాంకుమార్ తలనెప్పుడు పట్టుకున్నాయో ఆమెకు తెలియదు. ఆ తలనెలా దూరం జరిపిందో, ఆ గది లోంచి బైటికెలా వచ్చిందో, రిక్షా ఎక్కడి కని చెప్పిందో, శోభా వాళ్ళ యింట్లో కెలా వెళ్ళిందో ఆమెకు ఏదీ సరిగ్గా తెలియదు.

శాంత ఏవేవో మాట్లాడుతుంటే కాసేపు మౌనంగావింది.

"ఉండు ఆయన్ని పిల్చి పరిచయం చేస్తాను" గదిలో వున్న అతన్ని పిలవబోతుంటే శాంత ఆపింది.

"నీతో మాట్లాడాలి. ఇలా రా" అని బైటికి లాక్కొచ్చింది. ఇంటి వెనక జామ చెట్టు కింద కూర్చున్నారిద్దరూ.

"ఏంటి- ఏంటిలా వున్నావు. హడావుడే మిటి"-శోభ అడిగింది.

"శోభా - ముద్దు పెట్టుకుంటే చాలా బాగుంటుంది. ఎంతో బాగుంటుంది!"

శోభ అదిరిపడింది.

"ఏమిటి -'ఏం మాట్లాడుతున్నావు"

"రాంకుమార్ దగ్గరకు వెళ్ళాను. అతను నన్ను ముద్దు పెట్టుకున్నాడు!"

"స్టుపిడ్-అతని గదికి వెళ్ళావా? ఎంత ధైర్యం! బుద్ధిలేదూ!"

"రాంకుమార్ నన్ను ప్రేమిస్తున్నాడు!"

"ఏడిశాడు. ప్రేమా వాడి బొందా! నువ్వొట్టి తెలివి తక్కువ దానివని కని పెట్టాడు. అమ్మో వాడి గదికి వెళ్ళావా ఎంత ధైర్యం- 'ఏమన్నా జరిగితే!" శోభ గుండెలు బాదుకుంది.

"శోభా ఆపు నీ గోల! నేను కావాలనే వెళ్ళాను. కంగారు పడాల్సింది నా గురించి కాదు నీ గురించి. నీ ఆయన ముద్దు పెట్టుకుంటున్నా భయంగా వుండడం, చికాగ్గా వుండడం మంచి లక్షణం కాదు. ప్రేమ వుంటే అట్లా వుండదు. ఆయనకు నీ మీద అధికారం వుంది గానీ ప్రేమ లేదు. ఆ అధికా రాన్ని నువ్వు ఒప్పుకున్నావు గానీ అతన్ని ప్రేమించలేదు. అందుకని అలా వుంది" శోభ నివ్వెరపోయి చూస్తోంది.

"శోభా పెళ్ళి చేసుకొని పెద్ద తప్పు చేశావు. జీవితంలో దిద్దుకోలేని తప్పు. ఇక నీ జీవితం నీకుండదు. నీ ముఖం నీకుండదు. నీ గది నీకుండదు. నీకు నువ్వుండవు. అయ్యో శోభా ... ... నీ తెలివి ఎందుకూ పనికి రాదు. నీ మంచితనానికి విలువుండదు. నీ అందం చౌకై పోతుంది. అయ్యో శోభా! పెళ్ళెం దుకు చేసుకున్నావే!"

శాంత ఏడవడం మొదలు పెట్టింది.

శోభ శాంతను పట్టుకుని లేపి నిల బెట్టింది.

"పిచ్చెక్కిందా! తాగొచ్చావా! నీకు పెళ్ళి కాలేదని దిగులుపడుతూ పరాయి మగాళ్ళ చేత ముద్దులు పెట్టించుకుం టూ నాకు పెళ్ళయిందని ఏడుస్తావా? ఇంత కుళ్ళుందా నీ మనసులో- మా అమ్మ వాళ్ళు చూస్తే లేని పోని గోలవు తుంది. వెళ్ళు. నువ్వెళ్ళి పో!"

శాంతను నెడుతున్నట్టే గేటు దాకా తీసుకొచ్చి గేటు బయటకు నెట్టి గేటు వేసి లోపలకు పరిగెత్తింది శోభ.

*** *** ***

అప్పటి నుంచి శాంత శోభను చూడనే లేదు. శోభ ఉత్తరం రాయలేదు. శాంత

ఒకటి రెండు ఉత్తరాలు రాసినా వాటికి సమాధానం రాలేదు. శోభ తన స్నేహం మానేసినట్లేనని నిర్ణయించుకుంది శాంత. మళ్ళీ యిన్నేళ్ళకు శోభని చూడ బోతోంది. శోభతో స్నేహం మళ్ళీ మొదలవుతుందా? ఎలా వుంటుంది శోభ! ఇద్దరు కొడుకులట. భార్యగా, తల్లిగా ఎంతో సంతోషంగా వుండి వుంటుంది. శోభకు వున్న జీవితంతో సుఖపడటం ఎలాగో తెలుసు. తనలాగా లేనిపోని అశాంతులు పెట్టుకోదు. తన కిప్పుడు తక్కువేమీ లేదు.

చాలా మంచి ఉద్యోగం. తనకు ఆసక్తి వున్న ఫిజిక్స్‌లో తను సాధించాలనుకున్న డిగ్రీలు సాధించింది. తృప్తి కలిగేంత వరకూ చదివింది.

ఈ చదువుకోసం రాంకుమార్‌ని కూడా వదులుకుంది. శాంతకు నవ్వొచ్చింది.

ఎంత మంచివాడనుకున్నా రాంకుమార్‌ని పాపం మగబుద్ధి వదల్లేదు.

తనని, తనని చదువు మానెయ్యమన్నాడు.

ఎంత ధైర్యం - ఎట్లా అనుకున్నాడు తను చదువు మానేస్తుందని! ఎట్లా అనుకున్నాడు తను అతని కోసం తనకు వచ్చిన అవకాశాన్ని వదులు కుంటుందని! శాంతకు రాంకుమార్, అతనితో గొడవ పడిన రోజు గుర్తొచ్చాయి.

రాంకుమార్‌కి ఎమ్మెస్సీలో సీటు రాలేదు. బియ్యీడీ చేసి టీచర్‌గా గుంటూర్లోనే ఉద్యోగం సంపాదించాడు. శాంత కూడా ఎమ్మెస్సీ తర్వాత చదువు మానేసి ఉద్యోగం చూసుకుని రాంకుమార్‌ని పెళ్ళాడాలని అతని ఉద్దేశం.


శాంత రిసెర్చి చెయ్యాలనుకుంటూందనీ, అమెరికాలో చదవటం కోసం పరీక్షలు రాయబోతూందని తెలిసినప్పట్నించీ అతని వైఖరి మారిపోయింది. శాంత ఆ పరీక్షలు రాసి సంతోషంగా రాంకుమార్ దగ్గరకు వెళ్ళింది.

రాంకుమార్ శాంతను చూసి నవ్వను కూడా నవ్వలేదు.

"హైదరాబాద్ నుంచి నీకేం తెచ్చావో చెప్పుకో"

అంది శాంత ఉత్సాహంగా.

"నువ్వేం తెచ్చినా అది నాకవసరం లేదు. నేను తీసుకోను" అన్నాడు రాంకుమార్ సీరియస్‌గా.




శాంతకు అర్థమై పోయింది.

"మనం ఈ విషయం గురించి స్పష్టంగా మాట్లాడుకోవటం మంచిదేమో" అంది తనూ సీరియస్‌గా.

"ఔను! నేనూ అదే చెబుతున్నాను. శాంతా! నువ్వు అమెరికా వెళ్ళి చదవటం నాకిష్టం లేదు. నువ్వు అమెరికా వెళ్ళేటట్టయితే మన పెళ్ళి జరగదు"— శాంతేమీ మాట్లాడలేదు.

"నీకు నాకంటే అమెరికా వెళ్ళటమే ముఖ్యమా? మన జీవితం కంటే నువ్వు సంపాదించబోయే డిగ్రీలే ఎక్కువా? నా కోసం అమెరికా వెళ్ళటం మానుకో లేవా?"

రాంకుమార్ ఉద్రేకంగా అడిగాడు.

"నీ ప్రత్యేకతేమిటో - మన మధ్య మిగిలిందేమిటో నాకర్థం కావటం లేదు" అంది శాంత.

"అంటే ఏంటి నీ ఉద్దేశం. నీ దృష్టిలో నాకేమీ ప్రత్యేకత లేదా? అంత పనికిమాలిన వాణ్ణా?"

"మన ప్రేమకూ మన పెళ్ళికీ నువ్వు


# వేంకటేశ్వర ఆయుర్వేద నిలయము



## చింతలూరు - 533 232.

## తూర్పుగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

అత్యుత్తమ ఆయుర్వేద ఔషధములను ప్రశస్తముగా తయారుచేయు అగ్రశ్రేణిసంస్థ

ఆంధ్రప్రదేశ్ అన్నిముఖ్య పట్టణములలో వ్యాపార శాఖలు కలవు.

స్థానిక శాఖలు:

తిరుపతి: 46/1, బేరి వీధి,

చిత్తూరు: 11-4-45/1, రాయల్ కోయిల్ వీధి,

నెల్లూరు: ట్రంకు రోడ్

షరతులు పెట్టినపుడు నా దృష్టిలో నీకేమీ ప్రత్యేకత లేదు. నా అభివృద్ధికి నువ్వు అడ్డుపడుతున్నావంటే నీకు నా మీద ప్రేమ వుందని అర్థమా?
నీకు భయం - అమెరికా వెళ్ళొచ్చే నేనంటే భయం. నీ కంటే చాలా పెరిగి పోతాను- నీకు ఇన్‌ఫీరియారిటీ! నేనక్కడ ఏం చేస్తానో -నీకు అనుమానం! అమెరికా వెళ్ళొచ్చి నిన్ను కాదంటానేమో - నీకు అపనమ్మకం! మనసు నిండా యింత చెత్త పెట్టుకొని యింకా ప్రేమేమిటి?"

"ఇవన్నీ నిజం కాకూడదని ఎక్కడుంది? నాకు ఆ సందేహాలు రావటంలో అసహజత్వం ఏముంది?" రాంకుమార్ ఉక్రోషంతో అడిగాడు.

"ఏమీ లేదు రాంకుమార్ - ఏమీ లేదు. ఆ సందేహాలన్నీ నిజమయ్యే అవకాశం నూటికి నూరుపాళ్ళూ వుంది. నీ కంటే నేను గొప్పదాన్నవుతాను. ఇద్దరు అసమానంగా ఉన్నపుడు ఒకళ్ళు రెండో వాళ్ళను తక్కువ చెయ్యకుండా వుండటం కుదరదు. నేను నిన్ను చులకన చెయ్యొచ్చు. ఏం- ఇప్పుడు మగాళ్ళందరూ ఆడాళ్ళని చులకనగా చూడటం లేదూ?

"నేను అమెరికాలో నా యిష్టం వచ్చినట్లే ఉంటాను. ఏం -నువ్వు కేవలం స్నేహితుడిగా వున్నపుడు ముద్దు పెట్టించుకుంటే ఎలా వుంటుందోనని ఆలోచన తొలిస్తే నీ గదికి రాలేదా? అప్పట్నుంచీ నీతో ముద్దులాడటం లేదా? అక్కడ కూడా నాకు కావాలనిపిస్తే యిలాగే యింకెవరితోనైనా చేస్తానేమో! చేస్తాను కూడా. అసలు అమెరికాలో నీ కంటే అన్నివిధాలా గొప్పవాడు దొరికితే నీకు గుడ్‌బై చెబుతానేమో కూడా.

ఎందుకు చెప్పకూడదు? చెప్ప ఎందుకు?

నువ్వు షరతు పెడతావా నా ప్రేమకి?

నేను అమెరికా వెళితే నన్ను పెళ్ళి చేసుకోవూ?

నేనూ ఓ షరతు పెడుతున్నాను.

నువ్వు అమెరికా వెళ్ళి వస్తేనే నిన్ను పెళ్ళాడతా"- పెద్దగా, కఠినంగా నవ్వింది శాంత.

"నీకు పిచ్చెక్కింది" రాంకుమార్ పళ్ళబిగువున అన్నాడు.

"ఔను నాకు పిచ్చెక్కింది! నాకిపుడే కాదు అప్పుడప్పుడూ పిచ్చెక్కుతుంటుంది. ఆడాళ్ళని తమ యిష్టం వచ్చినట్టు ఆడించగలమనే మగాళ్ళని చూసినా, మగాళ్ళని చూసి భయ పడుతూ వాళ్ళ అడుగులకు మడుగులొత్తే ఆడాళ్ళను చూసినా నాకు పిచ్చెక్కుతుంది. నా పిచ్చి సంగతి యిప్పటి దాకా నీకు తెలియనందుకూ, నీకు తెలియదన్న సంగతి నేను గ్రహించలేనందుకూ నాకు చాలా విచారంగా వుంది..."

శాంత లేచి చెప్పులు వేసుకుంటుంటే రాంకుమార్ శాంత చెయ్యి పట్టుకున్నాడు.

"శాంతా కోపం మాని నిదానంగా ఆలోచించు. ప్రాక్టికల్‌గా ఆలోచించు. నెమ్మదిగా స్థిమితంగా కూచుని ఆలోచించు నీకే అర్థమవుతుంది."

"నెమ్మది, నిదానం, స్థిమితం, ప్రాక్టికల్- ఈ మాటలు నాకు చెప్పొద్దు. ఆ మాటలకూ నాకూ పెద్ద విరోధం. నేను ఆలోచించాల్సిందేమీ లేదు. నేను మా ఇంట్లో ఎంత యుద్ధం చేస్తున్నానో నీకు తెలియదూ? మా అమ్మా నాన్నలూ అన్నా అందరూ ఎలాగైనా నన్ను ఆపాలని చూస్తున్నారు. వాళ్ళతో పోట్లాడటంలో నువ్వు సాయం చెయ్యాల్సింది పోయి మళ్ళీ యింకో పోట్లాట సృష్టిస్తున్నావు. నీకు సిగ్గెయ్యటం లేదూ? 'నాకంటే ఎత్తుగా పెరగకూ' అని నన్ను బెదిరించటానికి నీకు సిగ్గుగా లేదూ? ఛీ - నిన్ను చూస్తుంటే నాకసహ్యంగా వుంది!" శాంత గబ గబా బైటికి నడిచింది.

ఆ రోజు రాంకుమార్ మాటల్ని తల్చుకుంటే శాంతకు యిప్పుడు కూడా కోపం వచ్చింది. పెళ్ళి కోసం తను చదువు మానుకుంటుందని ఎట్లా అనుకున్నాడు? తనసంత చీప్‌గా ఎట్లా అర్థం చేసుకున్నాడు. ఇప్పుడు కూడా తనకతన్ని తల్చుకుంటే కోపం వచ్చేస్తోంది -

తను తన యిష్టం వచ్చినంతకాలం చదువుకుంది. తనకు నచ్చిన ఉద్యోగమే చేస్తోంది.

'ఐనా ఏదో వెలితి - ఎందుకిలా - ఏం కావాలి' -శాంత మంచం మీద నుంచి లేచి ఇల్లంతా పిచ్చిదానిలా తిరిగింది.

ఈ జీవితమంతా తాను కావాలని ఏర్పరచుకున్నదే. తన కోసం తనకొక యిల్లుంది. ఈ యింట్లో అంతా తన యిష్ట ప్రకారమే జరుగుతుంది. ఏ మగాడికీ తలొంచకుండానే జీవిస్తోంది. ఐనా ఏదో అసంతృప్తి - అశాంతి - ఒంటరి తనం.

తనకూ పెళ్ళీ పిల్లలూ కావాలా? ఎంత ఆలోచించినా అవి కావాలనిపించటం లేదు. పిల్లల్ని కని పెంచే ఓపిక లేదు. కోరికా లేదు. కానీ ఉద్యోగం మాత్రమే తృప్తి నివ్వటం లేదు. ఇంకా పని కావాలి. చుట్టూ మనుషులు కావాలి. మెకానికల్ పనీ, ఆఫీసు మనుషులూ కాదు. మరింకేదో కావాలి -

శోభకీ అసంతృప్తి ఉండదు. అసంతృప్తి పడే స్వభావం కాదు దానిది. నా స్వభావమే యిలాంటిది. రేపు శోభ తనను చూసి నిండుగా నవ్వుతుంది. పదేళ్ళ క్రిందటి మాటలు గుర్తుకు తెచ్చుకుని నవ్వుతుంది.

"నా జీవితం చాలా బాగుందే, మా వారు ఎంతో మంచివారు. నేను లేకపోతే ఒక్క క్షణం బతకలేరు. శోభా శోభా అని యింట్లో వున్నంతసేపూ ఒకటే జపం అనుకో -

మా పిల్లలు ఎంత తెలివి గల వాళ్ళనుకున్నావూ? వాళ్ళనొదిలి నేను ఒక్క రోజు కూడా ఉండలేను. అమ్మా అమ్మా అంటూ వూపిరాడనివ్వరు!"

అని శోభ చెబుతుంటే తను నీరసంగా నవ్వుతుంది. మరేం చేస్తుంది! అబద్ధాలు చెబుతుందా?

"నా ఉద్యోగం చాలా పెద్దది. దాని మూలాన వచ్చిన హోదాతో చాలా తృప్తిగా వున్నాను. నా ఇంట్లో నా ఇష్టం వచ్చినట్లు ఎంత హాయిగానో వున్నాను.

నాకు జీవితంలో కావాల్సిందేమీ లేదు" అని చెబితే -...

ఈ అసంతృప్తి, దిగులు, వెలితీ అన్నీ [illegible] చెబితే ... కానీ శోభతో స్నేహం ఉన్నన్నాళ్ళూ కపటంగా ఎప్పుడూ మాట్లాడలేదు. శోభ కూడా అంతే. ఆ అలవాటు యిద్దరికీ లేదు. ఒకరి మాటలు యింకొకరికి నచ్చకపోయినా తామేం అనుకున్నారో అనే చెప్పుకున్నారు. తర్వాత తర్వాత జీవితంలో పై పై స్నేహాలు, అవతలి వాళ్ళకూ తనకూ సంతోషం కలిగించే మాటలే మాట్లాడటం అలవాటైనాయి గానీ శోభతో చిన్ననాటి స్నేహంలో అవి లేవు. ఇక యిప్పుడని కూడా ప్రారంభించాలేమో. రేపు శోభని చూడక తప్పదా?

శాంతకు మర్నాడు శోభని చూడాలని ఎంత వుందో, చూడకూడదని కూడా అంతగానూ వుంది.

* * * *

ఆదివారం ఉదయం పది గంటలకు మోహన్ వచ్చి శాంతను తన యింటికి తీసుకొచ్చాడు. శాంతకు గేట్లోనే ఎదురైంది శోభ. "శాంతా బాగున్నావా" అంటూ చెయ్యి పట్టుకుంది. "నువ్వెలా వున్నావే" అంటూ శోభను నఖశిఖ పర్యంతం చూసింది శాంత.

శోభ చాలా మారిపోయింది. లావెక్కింది. రంగు తగ్గింది. కళ్ళ కింద గుంటలు. నల్లటి వలయాలు. శోభ నవ్వేమిటి - ఇలా వుంది - పెదవులకు అతికించినట్లుగా వుందేమిటి?

శాంత ఆశ్చర్యంగా లోపలకు నడిచింది. మోహన్ "కూచోండి కూచోండి" అని మర్యాద చేస్తున్నాడు.

"శోభా - త్వరగా కాఫీ తీసుకురా" అని పురమాయిస్తున్నాడు.

శాంత కూర్చుని ఆ గదిని నాలుగు వైపులా పరికించి చూసి స్థిమితపడే లోపల శోభ కాఫీ తీసుకొచ్చింది. మోహన్, శాంత చెరో కప్పు తీసుకున్నారు.

శోభ ట్రే పట్టుకుని నిలబడింది.

"నువ్వూ తీసుకో" అంది శాంత.

"నేనింతకు ముందే తాగాను" మళ్ళీ

## ఢిల్లీ కా లడ్డూ

ఢిల్లీ లడ్డు తిన్న వాళ్ళందరూ
ఎందుకు తిన్నామా అని
ఛాఛఛ ఛాఛాఛా

ఢిల్లీ లడ్డు తినని వాళ్ళందరూ
అయ్యో మాకు దొరకలేదెందుకూ
నన్నా నాన ననన నానన్నానా
అని పశ్చాత్తాపపడతారట

ప్రేమించిన వాళ్ళందరూ
ఛాఛఛ ఛాఛాఛా
ప్రేమించని వాళ్ళందరూ
నన్నా నాన ననన నానన్నానా

పుట్టిన ప్రతి ఒకరూ
ఛాఛఛ ఛాఛాఛా
గర్భస్థ శిశువు కూడా
నాన్నా నాన ననన నానన్నానా

—నాయుని కృష్ణమూర్తి

[ఢిల్లీ కా లడ్డూ : ఢిల్లీ కా లడ్డూ జో ఖాతా హై ఓ పచతాయా హై జో న ఖాతా హై ఓ భీ పచతాయా హై (సామెత)]

# THE HAPPILY EVER AFTER REFRIGERATOR

The most silent statement of efficiency...



Automatic Defrosting
Hitachi designed compressor
Roll Bond Freezer
7 year guarantee
A choice of colours

**ALLWYN**

2000 SL REFRIGERATOR



**Available on easy instalments.**
**Contact personally with Salary Certificate.**

*An Allwyn is for always*

Authorised Dealer for Sales & Service:

**BUYWEL CORPORATION**

Hotel Annapurna Bldg., Nampally Station Road,
Hyderabad - 500 001. **Ph: 44691.**


పెదాల మీద అతికించుకున్న నవ్వు.

"మేమూ యిప్పుడే మా యింట్లో కాఫీ తాగి బయల్దేరాం. పదిహేను నిమిషాలైందేమో - అంతే!"

"నాకన్నిసార్లు అలవాటు లేదులే" అంది శోభ.

"కూర్చో"

"కూర్చుంటాను. అవతల పొయ్యి మీద పాయసం వుంది. అడుగంటుతుందేమో. మీరిద్దరూ మాట్లాడుకుంటూ వుండండి. అరగంటలో పనయిపోతుంది" కాఫీ కప్పులు ట్రేలో పెట్టుకుని తీసుకు వెళ్ళింది.

"ఈవిడకే పనిలోనూ స్పీడ్ రాదండీ! నురుకుదనం లేదు.' పదిగంటల కంతా వంట పూర్తి చేసి రెడీగా వుండు, నీ ఫ్రెండ్‌తో కబుర్లు చెప్పుకుందువు గాని అని రాత్రే చెప్పాను. పొద్దున అయిదింటికే లేచింది. పనిమాత్రం తెమలదు. ఇలా ఒంటిగంట దాకా సాగుతూనే వుంటుంది లెండి ఈ పని"_మోహన్ చెబుతూనే వున్నాడు. శాంత లేచి వంట గదిలోకి వెళ్ళింది.

శోభ యాలక్కాయలు పొడి కొట్టి పాయసంలో కలుపుతోంది.

"ఈ హడావుడేమిటే? ఇప్పుడీ పాయసాలు అవీ ఎందుకు?"

"నీ కోసమే. నువ్వు నా ఫ్రెండువనీ మా ఇంటికొస్తానని అన్నప్పట్నించి ఆయన హడావుడి హడావుడి కాదు.పాయసం సరే - యిటు చూడు"

గిన్నెల్లో సర్దిన బిర్యానీ, చికెన్ కూరా, రొయ్యలవేపుడు మిగిలిన కూరలూ చూపించింది.

"నువ్విప్పుడు మా ఆయన పై ఆఫీసర్‌వి కదా" అంటూ నవ్వింది.

"ఇవన్నీ ఇప్పుడు చేశావా?"

"బాగుంది - ఎప్పుడో చేసినవి పెడితే తింటావేమిటి?"

"ఎందుకు శోభా -'శాంతకివేం అక్కర్లేదు. నాలుగు చిన్నాళ్ళు పెట్టే గేటు బైటకు నెట్టినా సరిపోతుంది 'అని మీ ఆయనతో చెప్పలేక పోయావా?"

"శాంతా - నువ్వింకా అది గుర్తు పెట్టుకున్నావా?"

"నువ్వు మర్చిపోయావా?"

"ఎలా మర్చిపోతాను. అవి వేద మంత్రాల్లా నా జీవితాన్ని నడిపిస్తుంటే-"

"శోభా"_శాంతకేం మాట్లాడాలో తెలియక నోరు తెరిచింది.

"సరేలే - తర్వాత మాట్లాడుకుందాం. నువ్విప్పుడు పెద్ద ఆఫీసరువి. పైగా ఆయన పై అధికారివి.నీకోసం యివన్నీ చెయ్యక తప్పుతుందా! పద - వెళ్ళి హాల్లో కూచుని ఆయనతో మాట్లాడు. భోజనాలయ్యాక మనం మాట్లాడుకుందాం."

శాంతను వంటగది నుంచి బైటికి నడిపించింది.

హాల్లో మోహన్ శాంతను చాలా బిడ్డు పట్టించాడు.

తను చేస్తున్న పని ఎంత విలువైందో, మిగిలిన వాళ్ళంతా పని చెయ్యకుండా ఎలా కాలక్షేపం చేస్తున్నారో ఆపకుండా చెప్పుకుపోయాడు.

శోభ ఎప్పుడు భోజనానికి పిలుస్తుందా అని ఎదురుచూస్తూ కూచుని ఆ బోరు భరించింది.

శోభ భోజనాలు కూడా యిద్దరికే వడ్డించింది.

"అదేమిటే - ముగ్గురం తినేద్దాం" అంది శాంత.

"వడ్డించటానికి ఎవరూ లేకపోతే ఎలాగండి. అది మాకు మర్యాద కాదు" అన్నాడు మోహన్.

"మేమిద్దరం తింటాం. మీరు వడ్డించండి" అంది శాంత సీరియస్‌గానే.

శాంత జోక్ వేసినట్లు పెద్దగా నవ్వి కూచుని కంచం ముందుకి లాక్కున్నాడు.

శాంత లేచి నిలబడి "ముందు మీరు తినండి. తర్వాత మేమిద్దరం తింటాం" అన్నది.

"అబ్బే - అరరే - మీరెందుకు లేచారు? సరే ముగ్గురం తిందాం. శోభా నువ్వు కూడా వడ్డించుకో" అన్నాడు మోహన్.

శాంతకు మోహన్‌తో కలిసి తినాలని పించలేదు. శోభ వండి వడ్డిస్తే హాయిగా మింగుతూ దాన్ని అవమానిస్తాడా! నీడని అది ప్రేమించి గౌరవిస్తుందేమో గాని నేను గౌరవించను అనుకుంది మనసులో కోపంగా.

"లేదండి. మీరు ముందు తినెయ్యండి. మేమిద్దరం కబుర్లు చెప్పుకుంటూ తింటాం" అంటూ వెళ్ళి హాల్లో కూచుంది.

మోహన్‌కి ఏం చేయాలో తెలియక శోభను కసురుకున్నాడు.

"నీకు బొత్తిగా బుద్ధి లేదు. కూచో మనగానే కూచోవేం. దేభ్యం మొహం వేసుకు నిలబడతావేం" అంటూ గబగబా ముద్దలు మింగేశాడు.

శోభా శాంతా తీరిగ్గా భోజనాలు చేశారు.

శోభ వంటను మెచ్చుకుంటూ కడుపు నిండా తిన్నది శాంత. వాళ్ళు తింటున్నంత సేపూ శోభ శాంతకేం అమర్యాద చేస్తుందోనన్నట్లు అక్కడే తచ్చాడాడు మోహన్.

భోజనాలయ్యాక శోభా శాంతా బెడ్ రూంలోకి వెళ్ళారు.

"నిన్ను చూస్తుంటే చాలా అమాయ గా వుందే" అంది శోభ ఎంతో అభిమానంగా శాంతను చూస్తూ.

"అంత అమాయ నదాన్నిన అవసరం లేదులే - నేను నువ్వనుకున్నంత సంతోషంగా లేను" అంది శాంత మంచం మీద పడుకుంటూ.

"ఏం - నువ్వు ఎలా బతకాలనుకున్నావో అలాగే బతుకుతున్నావుగా!"

"ఔను బతుకుతున్నా. కానీ ఏదో అసంతృప్తి. దిగులు. ఉద్యోగం చెయ్యటమేనా జీవితం అనిపిస్తోంది. పెళ్ళి చేసుకున్నా పోయేదా అనిపిస్తోంది!"

"ఒద్దు. ఆ పని మాత్రం చెయ్యకు. పెళ్ళి చేసుకోకు!"

త్వర త్వరగా, శాంత ఎక్కడ పెళ్ళి చేసుకుంటుందోనన్నట్లు మాట్లాడింది శోభ.

"నువ్వు సంతోషంగా లేవా శోభా" శాంత అడిగింది.

"సంతోషమా? అంటే ఏమిటి? శాంతా- ఇరవైనేళ్ళ పాటు నా గురించి నేనేమనుకున్నానో, నా గురించి మీరంతా ఏమనుకున్నారో అవన్నీ నిజంకాకుండా పోయాయి. ఆ రోజుల్లో మీరంతా నా గురించి ఏమనుకునేవారు? నేను చాలా తెలివిగలదాన్ననీ, ఏ పనైనా చురుగ్గా చేస్తాననీ, ఏ సమస్యనైనా యిట్టే పరిష్కరిస్తాననీ, ఎలాంటివాళ్ళనైనా నా మాటలతో ఒప్పిస్తాననీ మీరంతాఅనేవాళ్ళు. నేనూ అనుకునేదాన్ని. నామీద నాకు చాలా నమ్మకం వుండేది. ఇవాళ ఆ 'నేను' లేను.

"నేను చాలా తెలివితక్కువ మొద్దుని. మందకొడిని. దేభ్యం మొహాన్ని. నాకు మాట్లాడ్డం చేతకాదు. ఎవరి దగ్గర ఎలా ప్రవర్తించాలో తెలియదు. పిల్లల్ని పెంచటం చేతకాదు"- శోభ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

శాంత శోభ భుజం మీద చెయ్యి వేసింది.

"ఊరుకో శోభా-"

"చెప్పనివ్వు- పన్నెండేళ్ళ పాటు ఈ మాటలు చెప్పుకోటానికి కూడా ఎవరూ లేరు. నీకు అర్థం కాదాయని చెబుతున్నాను. అసలు విషయం చెప్పనా? ఆయనొక మొద్దు. ఏమీ తెలియదు. ఒట్టి అనాగరికపు మనిషి. ఆయన కంటే నేను తెలివైన దాన్నని మొదట్లోనేకని పెట్టాడు. ఇక నన్ను సాధించడం, తను నాకంటే గొప్పవాడని నిరూపించుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఇది తెలియనన్నాళ్ళూ అతన్ని మారుద్దామని విశ్వప్రయత్నం చేశాను. ఆ విషయం తెలిశాక యిక చేసేదేం లేదని వూరుకున్నాను. అబ్బ- ఏం పెత్తనం చేస్తాడనుకున్నావు?"

"నువ్విలా మాట్లాడతావనీ, నీ జీవితం యిలా వుంటుందనీ అసలను కోలేదే! నువ్వు అతనితో పిల్లలతో చాలా సుఖంగా సంతోషంగా వుంటావనుకున్నాను"- శాంత దిగులు పడింది.

"సుఖం- అదొక్కటే తక్కువ! ఆ పిల్లలు రాక్షసులు!! వాళ్ళ దగ్గర నన్ను చులకన చెయ్యటం ఆయనకొక వినోదం. ముగ్గురూ కలిసి నన్నో పురుగుని తీసి పారేసినట్టు తీసేస్తారు. ఆరోజు నువ్వు పెళ్ళెందుకు చేసుకున్నావే అని ఏడుస్తుంటే నాకు కోపం వచ్చింది. కానీ నీ ఏడుపు వెనకాల నా మీద నీకెంత ప్రేమ వుందో తర్వాత అర్థమైంది!"

"మరి యిప్పుడెట్లా- ఏం చేస్తావు?"

"ఏంచేస్తాను? చదువు నాశనం చేసుకున్నాను. ఇపుడు ఏం ఉద్యోగం దొరుకుతుంది? ఇక యిట్లా బతకాల్సిందే. నాకిప్పుడు నీలా ఒక్కదాన్నే హాయిగా ఉద్యోగం చేసుకుంటూ బతకాలని వున్నా కుదురుతుందా?"

"ఎందుకు కుదరదూ? నాకు నా జీవితం బాగానే వుంది. కానీ జీవితాంతం ఈ ఉద్యోగమే అనుకుంటే విసుగు పుడుతోంది. మరింకా ఏం చెయ్యాలో తెలియడం లేదు. ఉద్యోగంలోనూ చికాకులు లేవని చెప్పలేం. నేను ఆఫీసర్ని గాబట్టి పైకి గౌరవిస్తున్నట్టుంటారు. నా వెనకాల ఏవో చెప్పుకుంటారు. నాకు పెళ్ళి కాలేదనీ, మంచిదాన్ని కాదనీ, చాలా వ్యవహారాలు నడిపాననీ- వీటిని నేను పట్టించుకోను. కానీ జీవితాంతం యిలాంటి వాతావరణంలో బతకాలంటే చికాకు గదూ-"

"మా ఆయనకు నువ్వంటే చాలా యిమ్మిరేషన్. నీ తెలివి గురించి చెబుతుంటాడు!"

"నీ తెలివి ముందు నా తెలివి ఎందుకు పనికొస్తుంది. నువ్వు నాకు పాఠాలు చెప్పకపోతే నేనసలు పరీక్షలు పాసయ్యేదాన్నే కాదు.

కాలేజిరోజుల్లో నాతో సహా మిగిలిన అమ్మాయిల కోరికేమిటో నీకు తెలియదూ?

'శోభలా వుండాలి'- అందరూ అదే అనుకునేవారు. నేనైతే ఎలాగోలా ఏదో ఒక విషయంలో నీకంటే ఒకడుగు ముందుండాలనుకునేదాన్ని- నువ్వు లేకపోతే నేనే ముందు! కానీ నువ్వుంటే యిక ఎవరైనా నీ వెనకే!"

"ఆరోజులు జ్ఞాపకం తేవద్దు శాంతా! ఎన్ని రాత్రుళ్ళు నిద్ర లేకుండా ఆ రోజులను తల్చుకుంటూ గడిపానో నువ్వూహించలేవు!"

"కానీ శోభా...నాకు చాలా ఆశ్చర్యంగా వుందే నువ్విలా మారటం. నువ్వు ఎప్పుడూ నీ గురించి ఆలోచించుకో లేదు. మీ అమ్మా వాళ్ళేలా చెబితే అలా చేశావు. దానికేమీ బాధ పడలేదు. చాలా సంతోషంగా వాళ్ళకోసం ఎన్ని విషయాల్లోనో రాజీపడ్డావు. పెళ్ళి కూడా యిష్టంగానే చేసుకున్నావు. ఇక్కడెందుకు అశాంతి పడుతున్నావుగి మీ అమ్మా నాన్నా శాసించినట్లే మీ ఆయన కూడా శాసిస్తున్నాడు. నువ్వెందుకిక్కడ బాధ పడుతున్నావు? ఎందుకు రాజీ పడలేక పోతున్నావు?"

"నిజమే. మా అమ్మానాన్నలు చెప్పినట్టు వినాలని నేను ఎన్నిటికో దూరమయ్యాను. అప్పుడేమీ బాధపడలేదు. ఎందుకంటే మా అమ్మ నన్ను నిజంగా ప్రేమించింది. ఆ ప్రేమ నాకు ఎంత వరకూ పనికొస్తుందని నేను ఆలోచించుకోలేక పోవటం నా పొరబాటే గాని ఆమె ప్రేమ అబద్ధం కాదు. అమ్మ నన్ను ఇష్టపడేది. ప్రేమించేది. నన్ను రకరకాల పనులు చెయ్యొద్దనటంలో ఆమె నిజంగా నా క్షేమం కోరే అనేది. ఆమెకు తెలిసినంతవరకూ అదే నా క్షేమం. ఆమెకున్న అనుభవంతో ఆమె నా జీవితాన్ని మంచిగా తీర్చిదిద్దాలను కుంది. ఆమె అనుభవం నాకు పనికి రాదని ఆమెకు తెలియదు. అప్పట్లో నాకూ తెలియదు. అందువల్ల ఆమె చెప్పినట్టు


## గోడ వెనక నువ్వు

నీలి కవరులోంచి
నీ ఊపిరి వినాలనిపించింది
ఈ పూట ఇంత రాత్రి
ఉడుపులన్నీ వాలిచేసి
నీ ముందు నగ్నంగా
వాలిపోవాలన్పించింది

రెండు పెదాల కొండల్లోంచి
మాటల సముద్రాలను
పుప్పొంగించాలనిపించింది

ఉదయ సాయంత్రాల నడుమ
తెగిన క్షణాల చిరునవ్వుల రెపరెపలు
నీ ముంగురుల అలల కింద
దాచాలనిపించింది
మెత్తటి నీ అరచేతుల్లో
ఒక కొత్త వాగ్దానంగా
పుష్పించాలనిపించింది
కానీ
వెయ్యి గోడల్లోంచి
విసురుగా వచ్చింది నీ ఉత్తరం
అణిచి పెట్టుకున్న కేకలా

- అఫ్సర్



వెయ్యటం నాకేమీ కష్టం అనిపిం చేది కాదు.

పెళ్ళిచేసుకుని నా తెలివితేటలతో సంసారాన్ని స్వర్గం చేసుకుని, భర్తను మెప్పించి చదువుకుందామనుకున్నాను. భర్త, పిల్లలు వీళ్ళ ప్రేమ యింకా గొప్ప దనుకున్నాను. ఇంటా బైటా కూడా ఒకరిచేత వేలెత్తి చూపించుకోకుండానే గొప్పదాన్ని ఔదామనుకున్నాను. అది ఎంత దురాశో ఇప్పుడు తెలిసి వచ్చింది. ఇంటా బైటా అన్నిచోట్లా అవమానాలే ఆడ దానికి రాసిపెట్టి వున్నాయి. వాటిని తప్పించుకుందామనుకున్నా తప్పించు కోలేం. మా అమ్మ తన అజ్ఞానం వల్ల ప్రేమ పేరుతో నన్ను అవమానించింది.

ఇక్కడ ఇతనికి నామీద ప్రేమలేదు. పెత్తనం వెయ్యటం తప్ప అతనికింకేమీ తెలియదు. ఇతను చేసే అవమానాలకు ఏ ముసుగులూ లేవు... ...

ముసుగు వెయ్యాల్సిన అవసరం కూడా లేదు. ఇంత స్పష్టంగా కనపడితే గాని నాకు అర్థం కాలేదు. అలా వుంది నా తెలివి. నాది తెలివని నువ్వు కూడా అంటుంటే నవ్వొస్తోంది. నేనొట్టి తెలివి తక్కువ దాన్ని!''

శోభ కళ్ళనుంచి నీళ్ళు కారుతుంటే శాంతకెలాగో అనిపించింది.

''అవమానాల నుంచి తప్పించు కోలేం అన్నావు. అది నిజంకాదు శోభా. మనం స్ట్రగుల్ పడాలి. ఆ అవమానాల నుంచి బైటపడటానికి కోపంతో పట్టు దలతో ప్రయత్నించాలి. అట్లా యుద్ధం చెయ్యటం చాలా బాగుంటుంది. నీకు ఆ ఆనందపు రుచి తెలియదు. నువ్వసలు ఆ స్ట్రగుల్‌లోకి వెళ్ళలేదు. ఇప్పుడైనా నీకు కావాల్సిన దానికోసం నువ్వు ప్రయ త్నించు!''

## ఎర్రమల్లెల గీతం

సూర్యుడు ఉదయిస్తే
ఎక్కడైనా అది ప్రభాతం
రక్తం ఓడితే దాని వెచ్చదనం
ఉద్యమ గీతాలకు ప్రభావితం
ఆలోచనా లేమితో తుపాకుల
ఎదురుగా
అనర్థం ఆశించని లేత చిగురులు
ఉద్యమాలకు ఊపిరి
అట్టడుగున మొదలైన రాపిడి
అనుకుంటే ఆగిపోయే చలనచిత్రం
జనసత్వాలుడిగిన సిద్ధాంతం
శిఖరమెక్కిన ఆశయాలు జారిపోయి
పేవ్మెంట్ల్లో పడి రక్తసిక్తమైనాయి
అధర్మాధికారం నేతల్లో
ప్రజ్వరిల్లే నిస్సహాయభావం ప్రజల్లో
రెపరెప మంటున్న జెండాలు
నెత్తుటితో తడిసి ముద్దలైనా సరే
కోకిలల గొంతుకలు నులిమి
పైకెగరకుండా పాతి పెట్టినా సరే
వసంతం రాక మానదు
విముక్తిన జెండా ఎగురక మానదు
కానీ మరువనిది ధరిత్రి చరిత్ర
ప్రజ శాసించే శాసనాలు
ప్రజాస్వామ్య శిలాఫలకంపై
న్యాయాలు
మరి ఆశయాల ఆవేశం నిద్రైతే
ఈ వుద్యమం సూర్యుడిని
ప్రసవిస్తుంది
లేకుంటే
గుండెల నుండీ రక్తం ప్రవిస్తుంది
ఎర్రమల్లెల గీతం
వర్తమానంలో భయంకరంగా
నిలుస్తుంది

—అడుసుమల్లి ప్రభాకరరావు

''ఇప్పుడు నాకేం కావాలో కూడా నాకు తెలియదు''- శోభ నిస్పృహంగా అన్నది.

''తెలుసుకో... .. తెలుసుకోటానికి అశాంతి పడు. బాధపడు. ప్రయత్నించు. ఇప్పుడు నేనూ అదే ప్రయత్నంలో వున్నాను. నాక్కూడా యింకేదోకావాలి. నేనింకేదో చెయ్యాలి!''

''శోభా- సనమ్మాయి వచ్చింది'' మోహన్ పెద్దగా కేకపెట్టాడు.

''అమ్మో- అప్పుడేఅయిందయిందా?'' శాంత కూడా టైము చూసుకుని హడా వుడిగా లేచింది.

''శోభా! రేపు సాయంత్రం నువ్వు మా యింటికి రాకూడదూ? నువ్వొక్క దానివేనే'' వెళుతూ అడిగింది.

''ఎందుకూ?'' శోభ నవ్వింది. ఈసారి శోభ నవ్వు కొంచెం బాగుంది అనిపించింది శాంతకు.

''ఊరికే - ఎన్ని సంవత్సరాలకు కలి శాం. మళ్ళీ ఆదివారం దాకా ఆగాలని పించడం లేదు. రేపు సాయంత్రం నేనొచ్చి నిన్ను మా ఇంటికి తీసుకెళ్తాను. సరేనా?''

శోభ సంతోషంగా ఒప్పుకుంది.

*** *** ***

''ఏమంటోంది మీ స్నేహితురాలు'' మోహన్ ప్రశ్నకు సమాధానం చెప్ప బుద్ధి కాలేదు శోభకు. మోహన్ అడిగే పద్ధతి ఆమెకెప్పుడూ నచ్చదు. ఏదో వ్యంగ్యం,ఎగతాళి వుంటాయి- అతనడిగే ప్రతి ప్రశ్నలోనూ. ఆఖరికి వంట యిందా భోజనం పెడతావా అన్న ప్రశ్నలు కూడా మామూలుగా అడగ లేడు. మామూలుగా అడగటమంటే తనను గౌరవించడం అనుకుంటాడేమో నని శోభకు అనుమానం.

''మాట్లాడవేం - చెవుడొచ్చిందా?''

''ఏముంటుంది! చిన్నప్పటి కబుర్లు చెప్పుకున్నాం. రేపు నన్ను వాళ్ళింటికి తీసుకెళ్తానంది.''


''ఎందుకూ? ఇవాళేగా కలిశారు. ఆవిడతో మరీ అతి చనువు పెంచు కోకు.''


''అదేమిటి! ఆవిడ చాలా తెలివిగల దంటారు. స్నేహం పెంచుకుంటే తప్పేమిటి?''

''తెలివిగలదే. కాదనటంలా. పెళ్ళి కాలేదు. ఎవర్నీ లెక్క చెయ్యదు. ఏవో వ్యవహారాలు నడుపుతుందంటారు. మనకు తెలియదనుకో ఎందుకు ఆవిడతో మరీ రాసుకుపూసుకు తిర గడం.... మన లిమిట్‌లో మనం వుండా లి!'' శోభ కోపంతో అసహ్యంతో మాట్లాడకుండాపడుకుంది. మోహన్ యిలా అన్నాడని శోభ చెబితే శాంత కోపంతో ఒణికి పోయింది.

''పెళ్ళికాని ఆడవాళ్ళకు తెలివి వుంటే అది వాళ్ళకు ఉపయోగపడితే ఆవిడతెలివిగలది అంటారు.

కానీ ఆమెను నమ్మరు. అనుమా నంతో చూస్తారు. పెళ్లయిన ఆడవాళ్ళలో తెలివి వుంటే దాని సాధ్యమైనంత అణ



## పూలు పలకరించినపుడు...

క్షణాల్ని, ఘడియల్ని వదిలేసి
యుగాల మధ్య సంచరిస్తున్నప్పుడు
మౌనిస్తూ, హసిస్తూ
పూలు పలకరిస్తున్నాయి.
కుంకుమ పోగుల్లా దర్శనమిస్తున్నాయి
కొమ్మల చివర జడగంటల్లా మెరుస్తున్నాయి
బెలూన గుత్తుల్లా ఊగుతున్నాయి
టార్చిలైట్లలా వెలుగులు చిమ్ముతున్నాయి
తమని అందంగా
పచ్చిక కేకుల మీద చెర్రీ పళ్ళలా అలంకరించుకోమని.

...

చిరుతిళ్ళనీ, చిలిపితనాన్నీ
సర్దుబాట్లనీ, చిత్ర సంధ్యల్నీ వదిలేసి
అగ్నిగుండం మీదుగా నడుస్తున్నప్పుడు
రంగుల్ల కోసం ఎదురుచూసే గోడల మీద ముద్దాడిన
కుంచెల అంచుల్లా
చెట్ల మీద చిగురు చిగురు సంతకాలతో
ఆకులు పచ్చపచ్చగా పిలుస్తున్నాయి.
ఆకుపచ్చ బూందీతో చెట్లకి స్నానం చేయిస్తున్నాయి.
చిలుక రెక్కల డిజైన్ల దుప్పట్లతో వృక్షాలని కప్పుతున్నాయి.
నీరెండ శరీరాలకి
తమని మెరిసే కళ్ళగా అతికించుకోమని.

...

ధర్మద్వేషం గుహలో బంధించబడ్డానని
మార్పు జ్వాలలతో మండుతున్నానని
అంటూకా ప్రకృతితో పెళ్ళికి వాయిదా వేయడం జరిగిందని
ఆ ఆకులకి, ఆ పూలకి ఏమని తెలుస్తుంది?

—ఒబ్బిని

చాలని చూస్తారు.

పెళ్లయిన ఆడది కూడా తెలివి గల దిగా గుర్తింపబడుతుంది. అక్కడక్కడా.

కానీ గుర్తుంచుకో - ఆమెకు గుర్తింపు వచ్చిన దానికంటే వందరెట్లు తెలివి ఆమెకుంటుంది. ఆ తెలివిని అణచడం సాధ్యం కాక, మొదటికే మోసం అని తెలిసి కొంచెం ఆమెకు అవకాశం యిస్తారు. దానికే పొంగిపోయి ఆ చోటు లోనే స్థిరపడతారు ఆడవాళ్ళు. ఆడదాని శక్తిలో తెలివిలో సగం పైగా సమాజంతో ఇంట్లో వాళ్ళతో యుద్ధం చెయ్యడానికే సరిపోతుంది.''

శాంత కోపాన్ని మళ్ళీ శోభే ప్రయత్నించి చల్లార్చింది.

శోభకు శాంత యిల్లు బాగా నచ్చింది.

ఇద్దరూ ఎన్నో కబుర్లు చెప్పుకున్నారు. ఒకరి జీవితం ఒకరు అర్థం చేసుకున్నారు.

''ఏం చెయ్యాలి? మనం ఏం చెయ్యాలి?''

అని పదే పదే అశాంతితో ఆరాటంతో ప్రశ్నించుకున్నారు.

ఈ ప్రశ్న మళ్ళీ మళ్ళీ సమాధానం దొరికేదాకా వేసుకోవాలని నిర్ణయించుకున్నారు.

*** *** ***

మూడు నెలలుగా శాంత స్నేహంతో కొత్త ధైర్యాన్నీ ఉత్సాహాన్నీ తెచ్చు కుంది శోభ.

ఇద్దరూ కలిసి చర్చించి శోభ 'లా' చదివితే బాగుంటుందని నిర్ణయించుకున్నారు.

మోహన్‌కి చెప్పకుండానే ఆ నిర్ణయం తీసేసుకుంది. ఈ పదేళ్ళలో శోభ చదువుకుంటా నంటమూ, మోహన్ గట్టిగా వ్యతిరేకించడమూ అనేకసార్లు జరిగింది. ఈసారి యిక అతన్ని ఒప్పించే ప్రయత్నం మాను కుంది. ఆరోజు యూనివర్సిటీకి వెళ్ళి ఫీజు కట్టి రావాలనుకున్నారు.

''నేను ఆఫీసుకు వెళ్ళి ఓ గంట పని చూసుకుని వస్తాను. నువ్వు పదకొండు గంటల కంతా రెడీగా వుండు'' అని చెప్పింది.

''పిల్లలు మూడింటి కంతా స్కూలు నుంచి వచ్చేస్తారు. నువ్వు వీలైనంత తొందరగా రా'' అంది శోభ. శాంత ఎంత తొందరగా రావాలనుకున్నా కుదర లేదు. శలవు పెట్టినా పోయేది అను కుంటూనే పని చూడక తప్పింది కాదు.

పన్నెండున్నరకు ఆఫీసులో బయల్దేరి హడావుడిగా ఆటోలో వచ్చేసింది.

శోభ వాకిట్లోనే వుంది.

ఆటోలో శాంతను చూసి హడా వుడిగా ఇంటికి తాళం వేసి వచ్చింది.

శాంత ఆలస్యానికి కారణాలు చెబు తోంది.

శోభ మూడింటికంతా యిల్లు చేరక పోతే పిల్లలు చేసే గోలా వాళ్ళ ఆకలి గురించి చెబుతోంది.

ఆటో ఆగింది.

ఇద్దరూ బైటికి తొంగి చూశారు.

వాళ్ళ ఆటోనే కాదు. రోడ్డు కటూ యిటూ వున్న ట్రాఫిక్కంతా స్తంభించి పోయింది.

రోడ్డు మధ్యలోంచి పెద్ద ఊరేగింపు వెళ్తోంది. అంతా ఆడవాళ్ళే.

''మహిళలపై అత్యాచారాలు నశించాలి.

వరకట్న హత్యలు నశించాలి
ఆత్మహత్యలన్నీ హత్యలే
భర్తంటే ఆజన్మ శత్రువా
బానిసకూ ఆడదానికీ తేడా లేని స్థితి
ఇంకానా ఇకపై చెల్లదు

బీడీ కార్మికుల కోర్కెలు అంగీక రించాలి

న్యాయమైన వేతనాలు చెల్లించాలి
ఆకాశం సగం మనది
సమాజంలో సగం మనం
సమాన హక్కులపై పోరాడుదాం''

ఇలాంటి నినాదాలతో ఆ ఊరేగింపు కదిలి పోతూంది. ఊరేగింపులో ఎక్కువ సుంది కార్మిక స్త్రీలే వున్నారు.

''సాయంత్రం నాలుగింటికి జరిగే సభకు మహిళలంతా తప్పక రండి''

అనే పెద్ద అక్షరాల పోస్టర్లు అతికించిన అట్టలు ముందుకి సాగిపోతున్నాయి.

శాంత అప్రయత్నంగా శోభ చెయ్యి పట్టుకుంది. శోభ ఆ చేతిని మరింత గట్టిగా నొక్కి పట్టుకుంది. ఆ ఊరేగింపు ఉత్సాహం గాలి తరగల్లో వ్యాపించి వాళ్ళి ద్దరి ఊపిరిలో చేరి ఒక అద్భుతమైన అనుభూతిని కలిగించింది.

నెమ్మదిగా ట్రాఫిక్ కదిలింది.

యూనివర్సిటీలో పని పూర్తి చేసు కునే సరికి మూడు దాటింది.

''మీటింగుకి వెళ్దామా?''

శాంతే శోభ ఎక్కడ రానంటుందో అని భయంగా అడిగింది.

మీటింగుకి వెళ్దామా ఒద్దా అన్న చర్చ లేకుండా పోనీ ఒద్దులే అన్న మాట పొర పాటున కూడా అనకుండా అసలా ఆలో చన కూడా రానివ్వకుండా మీటింగ్‌కి వెళ్ళి పోవాలని వుంది శాంతకు.

శాంత ఆ మాట అనదేమో అని భయపడుతున్నట్లుగా ''వెళ్దాం. తప్ప కుండా వెళ్దాం'' అంది. వెంటనే శాంత నిశ్చింతగా నవ్వింది.

''మరి పిల్లలు-'' శాంతే అడగకుండా వుండలేక పోయింది.

''ఏదో తిప్పలు పడతార్లే, ఐదింటికి ఆయన వచ్చేస్తాడు!''

''తాళం చెవి నీ దగ్గరుందేమో''

''తాళం పగలగొట్టుకుంటాడులే. నువ్వూరుకో'' చిరాకు పడింది శోభ.

వీళ్ళు వెళ్ళేసరికి మీటింగు మొద లైంది. ఎవరో ఒకావిడ మైకు దగ్గరకొచ్చి

''ఇప్పుడు బీడీ కార్మికురాలు సీత మాట్లాడుతుంది'' అని చెబుతోంది.

సీత లేచి మైకు దగ్గర కొచ్చింది.

''బీడీ కార్మికులం మూడు నెలలు సమ్మె చేశాం. మేం ఎందుకు సమ్మె చేశామో, సమ్మె చేస్తే మా పరిస్థితి ఏంటో చెప్పటానికే నేను మీటింగుకి వచ్చాను.

మేం రోజుకి వెయ్యి బీడీలు చేస్తే తొమ్మిది రూపాయలిస్తాడు సేటు. మేము పదిహేను రూపాయలిమ్మని అడిగాం. మేం మా ఇంట్లోనే కూచుని పని చేస్తాం. ఇదొక ఉద్యోగమన్నట్లు ఉండదు. మాకు ఉద్యోగస్తులకూ, ఫ్యాక్టరీలకు వెళ్ళి పనిచేసే వారికి వుండే ఏ బెనిఫిట్లూ వుండవు. అవన్నీ మాకు రావాలంటే మేం ఫలానా కంపెనీలో పని చేస్తున్నట్లు కార్డుండాలి.

"ఆ కార్డులు ఇవ్వమని అడిగాం. ఇందులో అన్యాయం ఏముంది? కార్డులు ఎందుకివ్వరు! ఐతే మేం ఆడవాళ్ళం సమ్మె చేస్తుంటే అందరికీ అలుసుగానే వుంది. మమ్మల్ని ఇష్టం వచ్చినట్లు బూతులు తిడుతున్నారు. మా మీదికి రౌడీలను పంపించారు. మేం మంచి వాళ్ళం కాదని రకరకాల ప్రచారాలు చేశారు. మేం యూనియన్ పెట్టుకో కూడదంట. ఆడాళ్ళకి యూనియన్ దేని కంటారు? ఆడాళ్ళు పని చెయ్యటం లేదా? పని చేసే వాళ్ళకు యూనియన్లుండవా?

మేం బీడీలు చుట్టే పనెందుకు చేస్తున్నాం? తిని కూచోలేకా? ఇంట్లో వంట చేసి గుడ్డలుతికి పిల్లల్ని సాకి ఇంటెడు చాకిరీ చేసుకుని కూడా మేమెందుకు బీడీలు చుడుతున్నాం?

"ఇది ఇంకెవరికీ అర్థం గాకపోయినా మా మగాళ్ళకి అర్థం కావాలి గదా. వాళ్ళకే అర్థం కావటం లేదు. మగాళ్ళు వాళ్ళ సంపాదనంతా వాళ్ళిష్టమొచ్చినట్లు తగలేస్తుంటే పస్తులు పడుకోలేక, పిల్లల్ని పస్తులు పెట్టలేక బీడీలు చుడుతున్న వాళ్ళున్నారు. మగవాళ్ళ సంపాదన అసలేమీ లేక బీడీలు చుట్టి బతుకుతున్న వాళ్ళున్నారు.

"మగాళ్ళు ఒక్కళ్ళే కష్టపడడం చూడ లేక వాళ్ళ కష్టం పంచుకుందామనుకున్న వాళ్ళున్నారు. ఏదో ఓ ఖర్చుకి, రోగాలకి రొప్పులకీ పనికొస్తుందని పని చేస్తున్నాం. అందరం కుటుంబం కోసమే పని చేస్తున్నాం. కానీ ఇవాళ మేం సమ్మె చేస్తుంటే మా కుటుంబాలే ఒద్దంటున్నాయి.

"నా సంగతే చూడండి. మా ఆయనకు యూనియన్ అంటే గిట్టదు. 'ఇంట్లో కూచుని బీడీలు చుట్టుకో! అంతేగాని గడప దాటితే వూరుకునేది లేదు' అంటాడు. కొన్నాళ్ళు ఆయనకు తెలియకుండా యూనియన్ పనులు చేశాను. తెలిశాక చావగొట్టాడు. ఐనా నేనూరుకోలేదు. ఇంట్లో నుంచి బైటికి నెట్టేశాడు. నేను మళ్ళీ ఇంట్లో జొరబడ్డాను. రోజూ తిట్లూ తన్నులే - నువ్వసలు బీడీలే చెయ్యొద్దంటాడు. నేనెందుకు వూరుకోవాలి? నాకొచ్చిన పని నేనెందుకు చెయ్యకుండా వుండాలి? నా పని మీద అతని పెత్తనమేంది? నాకు ఇద్దరు సేట్లా? నేనే సేటు పెత్తనాన్నయినా ఎందుకు సహించాలి?

"మీరంతా చప్పట్లు కొడుతున్నారు. నేను బాగా మాట్లాడతానని అక్క లందరూ అంటారు. ఇక్కడ మీ అందరికీ సేటు మీద పోట్లాడమని చెప్పిన



నేను, నేను మీద తిరగబడమని చెప్పినా నేను ఇంటికెళ్ళి చావు దెబ్బలు తినాలి. మీటింగుకి వచ్చినందుకు మీరంతా కూడా ఇంట్లో తిట్లూ తన్నులూ తినాలి. ఇదీ మన పరిస్థితి - మనం దీనిమీద కూడా తిరగబడాలి. మనందరం కలిసి పెత్తనం చేసే వాళ్ళందరి మీదా పోట్లాడాలి''.

ఈరకంగా సాగిందిఆమె ఉపన్యాసం.

అక్కడ కూచున్న స్త్రీలందరి హృదయాల్లోనూ అలజడి.

ఏమిటి మన జీవితాలు?

ఇంటా బైటా దోపిడీకి, అవమానాలకు, తిరస్కారాలకు గురి కావటమేనా?

ఎప్పటికప్పుడు అన్నీ భరిస్తూ రాజీ పడటమేనా?

ఎందుకు రాజీ పడాలి?

రాజీ పడి పొందేదేమిటి?

పోరాడితే పోయేదేమిటి?

పోవటానికి ఏ ఆడదానికైనా ఏమున్నాయని!

ఆస్తులా, గౌరవాలా, మర్యాదలా, ప్రేమలా ఏమున్నాయని.

భర్తకో, తండ్రికో, కొడుకుకో లొంగినంత కాలం వున్నట్లే వుంటాయి.

లొంగకూడదు అనుకున్న మరుక్షణంలో అన్నీ పోతాయి.

రక్తం ఇచ్చి ఊపిరి పోసిన పిల్లలపై కూడా హక్కుండదు.

ఏమున్నాయి పోవటానికి-

అవమానాలు పోతాయి తిట్లూ, తన్నులూ, తిరస్కారాలూ పోతాయి.

శాంత శోభా కొత్త ఉత్తేజంతో ఊగిపోయారు. సభ ముగిసినా వాళ్ళకు అక్కడ నుంచి కదలాలనిపించలేదు.

''శోభా - నేనేం చెయ్యాలో నాకు తెలిసింది. నా అసంతృప్తి ఎందుకో నాకు తెలిసింది. నా ఒక్క దాని కోసం నేను యుద్ధం చెయ్యటం కాదు.ఆడవాళ్ళందరి కోసం సమాజంతో యుద్ధం చెయ్యాలి. అందరితో కలిసి అందరి గౌరవం కోసం పోరాడాలి. నేనేం చెయ్యాలో నాకు తెలిసింది.''

శాంత కళ్ళల్లో కొత్త వెలుగు. కొత్త లక్ష్యం కనిపెట్టిన తృప్తి.

'నేను నా కోసం కూడా యుద్ధం మొదలెట్టాలి' అనుకుంది శోభ.

ఇద్దరూ రోడ్డుమీదికి వచ్చారు.

శాంత టైము చూసింది. రాత్రి తొమ్మిదయింది.

''ఇప్పుడు మోహన్ బాగా గొడవ చేస్తాడేమో - ఇంతాలస్యమయింది. ఎట్లా? ఏం చేస్తావు... బాగా గొడవ చేస్తాడా'' ఆందోళనగా అడిగింది.

''గొడవ చెయ్యాల్సింది నేను. ఆలస్యమయింది నా జీవితానికి. నేను వెంటనే గొడవ మొదలు పెడతాను. ఇంక ఆలస్యం చెయ్యను. ఏమైనా సరే ఇంక ఆలస్యం చెయ్యను. నాకు కావాల్సిందేమిటో నేనేం చెయ్యాలో నాకు తెలిసింది.''

శాంత సంతోషంగా శోభను కావలించుకుంది.

వాళ్ళ ఉత్సాహం చూసి-

ఆ రాత్రి తెల్లవారటానికి తొందర పడుతోందా అన్నట్లుగా నల్లటి ఆకాశంలో మెరుపులు మెరిశాయి.

# నెలలు నిండని శిశువులు

అంతస్సూత్రాలు తెలియనివాళ్ళకు
ఆర్థిక మూలాల్లోకెళ్ళని వాళ్ళకు
ప్లాస్టిక్ పూల వాసన చూస్తున్నవాళ్ళకు
సూర్యుడి తీక్షణ కిరణాల వాడికే
కళ్ళు బైర్లు కమ్మేవాళ్ళకు
అవును జ్ఞాననేత్ర కవిత్వం ఆత్మవంచనే
'అవును సూర్యుని వారసత్వ కవిత్వం
వాళ్ళకు

ముమ్మాటికి దివాళాకోరుతనమే
రేపు మీద ఆశలేనివానికి
అంతా శూన్యమే కదా!
రేపు మీద ఆశగలవాని సొత్తే
భవిష్యత్తు కదా!
కాళ్ళు పైకి తలకిందకు పెట్టి చూస్తూ
ప్రపంచం తల కిందులుగా వుందని
గడియారాలు వెనక్కి నడుస్తున్నాయని
ఉదయిస్తున్న సూర్యుడ్ని అస్తమిస్తున్నాడని
'లబలబ'లాడితే వచ్చేది ఆయాసం
కాకుంటే కాస్త అవరోహణా ప్రచారం

వాస్తవాన్ని పక్కకు నెట్టి
అద్దంలోని మీ ప్రతిబింబాన్నే
మీ శత్రువుగా భ్రమించి
'టకటక' పొడుస్తున్న పిచ్చుకల్లారా
భ్రమల్లోంచి రండి

నిజాన్ని తెలుసుకుని
చెదిరిన ప్రకాపుల్ని, బెదిరిన మనసుల్ని
వెల్లావెదర్రైన మరుగుజ్జ ఆలోచనల్ని
నీడలో కుష్కిస్తున్న ముఖాల్ని
సరిచేసుకోండి సరి చూసుకోండి
ఊబిలోకి కూరుకుపోతున్న
మనిషికి నీతులు వేదాలు కాదు
మునిగిపోకుండా చేయందించండి
వెనక్కి కాళ్ళు మెలిచిన
దయ్యాల్లారా!
నెలలు నిండకుండానే పుట్టిన
అర్భకుల్లారా!!
రాజకీయం లేకుండా మనిషి లేదు
మనిషి లేకుండా రాజకీయం లేదు
తలెత్తి వుమ్మితే తిరిగి మీ మీదే
పడుతుంది
'వైరి' గోడకొట్టిన బంతై మిమ్మల్నే
తాకుతుంది

(అధివాస్తవికుల తాజా ఆందోళనచూసి)

జూకంటి జగన్నాథం

